1
నవతెలంగాణ
మనుగడ తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | సెప్టెంబర్ 17, 2024 | www.navatelangana.com

స్టోన్ క్రషర్ గుంతలో పడిన బాలిక మృతి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండలంలోని పిప్రి గ్రామంలో స్టోన్ క్రషర్ గుంతలో పడిన బాలిక మృతి చెందింది. ఎస్ఐ అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం..పిప్రి గ్రామ సమీపంలోని స్టోన్ క్రషర్ వద్ద చత్తీస్‌ఘడ్ నుండి మండరి భారత్, గాయత్రీ కుటుంబం వలస వచ్చి ఉంటోంది. ఇద్దరు కుమార్తెలు కలిశ్వరి, సంజన రోజు మాదిరిగా పక్కనే ఉన్న క్రషర్ వద్ద తవ్విన క్వారీ గుంతలో స్నానానికి వెళ్లారు. చిన్న కుమార్తె సంజనకు ఫిట్స్ వచ్చి గుంతలో పడడంతో పక్కనే ఉన్న కాలేశ్వరి వెంటనే వెళ్లి తల్లిదండ్రులను తీసుకొచ్చేందుకు వెళ్లింది. వారు వచ్చే లోపే నీట మునిగిపోయింది. గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రం సంజన మృతదేహం లభించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ముగ్గుల పోటీలో కంది సతీమణి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలో వినాయక చవితి నవరాత్రోత్సవాలు ముగింపుకు చేరువవుతు మరింత ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి సతీమణి కంది మౌనా శ్రీనివాసరెడ్డి రెడ్డి సంఘం గణేష్ మండపాన్ని సందర్శించారు. నిర్వాహకులు ఆమెకు స్వాగతం పలికారు. ముందుగా గణపతిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ జరిగిన ముగ్గుల పోటీలో స్థానిక మహిళలతో కలిసి ముగ్గులు వేసి అలరించారు.



వీరోచిత పోరాటం..చెదరని జ్ఞాపకం..!

- నాటి సాయుధ పోరులో ఉమ్మడి జిల్లా వాసుల ధీరత్వం
- నిజాం నిరంకుశత్వంపై అలుపెరగని పోరాటం
- అసువులు బాసిన అనేక మంది యోధులు
- నేడు విలీన దినోత్సవం

తెలంగాణలో బానిస బతుకుల విముక్తి కోసం సాగించిన నాటి సాయుధ పోరాటం నేటికీ గొప్ప చరిత్రగా మిగిలిపోయింది. దేశమంతా స్వాతంత్ర్య సంబరాల్లో మునిగిపోగా.. తెలంగాణ ప్రాంతం మాత్రం నిజాం నిరంకుశ పాలనలో మగ్గిపోతోంది. నిజాం సైన్యంగా చెప్పకునే రజాకార్ల ఆగడాలు మితిమీరిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రాణాలను అరిచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ జీవించారు. ఈ దౌర్జన్యాన్ని భరించలేని కమ్యూనిస్టులు తిరుగుబాటు మొదలు పెట్టారు. పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య, చంద్ర రాజేశ్వర్‌రావు, రావి నారాయణరెడ్డి, మగ్దుం మొహినొద్దీన్ వంటి నేతలు పోరాటానికి శ్రీకారం చుట్టారు.వీరిని స్ఫూర్తిగా తీసుకున్న ఉమ్మడి జిల్లావాసులు సాయుధ పోరాటానికి సిద్ధమయ్యారు. 1946 సెప్టెంబర్ 11న ఉద్యమాన్ని ప్రారంభించి రెండేండ్ల పాట్లు పోరాడి నిజాం ప్రభుత్వాన్ని గద్దెదించారు. సమరశీల పోరాటాలతో 1948 సెప్టెంబర్ 17న నిజాం జెండాను దింపి ఈ ప్రాంతానికి స్వాతంత్ర్యాన్ని అందించారు. ఈ పోరాటంలో అనేక మంది ఉమ్మడి జిల్లా పోరాట యోధులు అసువులు బాసారు. ఈ పోరాటాన్ని నేటికీ చరిత్రకారులు వల్లెవేసుకుంటున్నారు. మంగళవారం విలీన దినోత్సవాన్ని పురస్కరించుకొని నాటి పోరాట చరిత్రపై ప్రత్యేక కథనం..

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

నిజాం ప్రభుత్వ హయాంలో జరిగిన ఆకృత్యాలు జిల్లా వాసులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసేవి. పండించిన పంటలకు శిస్తు వసూలు చేస్తూ నోటికాడ బుక్కను లాగేసుకునేవారు. కనీసం స్వేచ్ఛగా జీవించే పరిస్థితులు కూడా ఉండేవి కావు. నిజాం ప్రభుత్వ సైన్యం రజాకార్ల దౌర్జన్యాలతో బతకడమే కష్టంగా మారింది. ఎవరైనా ఎదిరిస్తే రజాకార్లు గుర్రాలతో దాడులు చేసేవారు. మహిళల పరిస్థితి మరీ దయనీయంగా ఉండేది. సింగరేణి కార్మికులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా బలవంతంగా గనుల్లోకి పంపించేవారు. ఆ సమయంలో రక్షణ చర్యలు అంతగా లేకపోవడంతో కారుచీకట్లలో మట్టిపెల్లలు కూలి అనేక మంది కార్మికులు మృతి చెందారు. కార్మికులపై రజాకార్లు, బ్రిటీషు సైన్యం చేస్తున్న అరాచకాలను భరించలేక కార్మికులకు మద్దతుగా శేషగిరిరావు, రంగయ్య, పాపయ్య పోరాటం సాగించి వారి తుపాకీ తూటాలకు బలయ్యారు. వీరితో పాటు అనేక మంది ఉమ్మడి జిల్లా పోరాట యోధులు కదనరంగంలోకి దూకారు. రెండేండ్ల పాటు సాగించిన త్యాగధనుల పోరాటం ఫలితంగా నిజాం ప్రభుత్వం లొంగిపోయింది. హైదరాబాదు సంస్థానంగా ఉన్న తెలంగాణ ప్రాంతం భారతదేశంతో విలీనమైంది.

పోరాటంతోనే విముక్తి

సాయుధ పోరాటంలో ఉమ్మడి జిల్లాకు చెందిన అనేక మంది స్వయంగా పాల్గొన్నారు. నిజాం ప్రభుత్వం దౌర్జన్యాలపై ఎదురొడ్డి పోరాడారు. ఆదిలాబాద్ జిల్లాలో రాంకిషన్ శాస్త్రి, కస్తాల రాంకిష్టు, డా.బొల్లన్‌వార్, పోతుగంటి పోశెట్టి, గాలిపెల్లి రాములు, నరాల నారాయణ, గుండావార్ సదాశివ్, పండరినాథ్, శివ్వన్నయాదవ్, వన్నెల హన్మంతు, వన్నెల ఎల్లన్న, యధువంశీ, దేవిదాస్ తదితరులు పోరాటం నిర్వహించారు. నిజాంపై పోరాటంలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కూడా చరిత్ర పుటల్లో నిలిచిపోయింది.ఈ జిల్లా నుంచి పైకాజీ రామచంద్రారావు, రాంచందర్‌రావు అన్నాజీ, కొండా లక్ష్మణ్‌బాపూజీ, చీల శంకర్, చీల విఠల్, కొండ్ర శంకర్, ఎ.రేవయ్య, ఎ.శంకరయ్య, బాపూజీ, వామన్‌రావు, బి.వెంకటేషం, టి.తిరుపతితో పాటు మరికొందరు పోరాట యోధులుగా నిలిచారు. వీరితో పాటు నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన మన్యం వీరుడు కొమురంభీం, రాంజీగోండ్‌లు చరిత్రలో యోధులుగా నిలిచిపోయారు. నిజాంను గద్దె దింపడంతో నిర్మల్ జిల్లా ప్రత్యేకతను సంతరించుకుంది. నిర్మల్ ప్రాంతంలో నిజాం సర్కారు అరాచకాలకు అంతులేకుండా పోయింది. ఈ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటం సాగించిన సాయుధపోరాట యోధులు వెయ్యి మందిని నిజాం, బ్రిటీషు సర్కారు మర్రి చెట్టుకు ఉరి తీసింది. ఈ అమానుష ఘటనపై జిల్లావాసులు ఇప్పటికీ చర్చించుకుంటారు. ఆకుల గోవిందం, కలం వీరుడు ఎం.హన్మంతరావు(ఠాకూర్)తదితరులు పోరాటం సాగించారు. వీరితో పాటు మంచిర్యాల జిల్లాలోనూ అనేక మంది పోరాటం సాగించారు. వీరితో పాటు వనమామలై వరదాచార్యులు, కేశవులు, ఎ.రాజారెడ్డి,కుమార్ పోశెట్టి, చరణ్‌దాస్, గంగారాం, గడ్డం నానయ్య, వనపర్తి దుర్గయ్య, పుత్కార్ రాజుగౌడ్, కె.కిష్టయ్య వంటి అనేక మంది ఉమ్మడి జిల్లావాసులు సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించారు. వీరందరి త్యాగ ఫలితంగానే నాడు తెలంగాణ ప్రాంతం నిజాం ప్రభుత్వ బానిస సంకెళ్ల నుంచి విముక్తి కాగలిగిందని చరిత్ర చెబుతోంది.



ఫ్యాక్టరీ నిలిపేసేలా చొరవ చూపుతా

- జిల్లా కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ



నవతెలంగాణ-నిర్మల్

ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా దిలావర్‌పూర్ మండల కేంద్రంలో 56 రోజుల నుండి, గుండంపల్లి గ్రామంలో 12 రోజులు నుండి ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. రిలే నిరాహారదీక్షలు చేస్తున్న రైతులకు కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ సోమవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తే ఫ్యాక్టరీ పనులు తాత్కాలికంగా నిలిపేసి మళ్లీ రెండు నెలల క్రితం పనులు ప్రారంభించడంతో రిలే నిరాహార దీక్షలు చేస్తున్నామని తెలిపారు. మొట్టమొదటి సారిగా సంఘీభావం తెలిపినందుకు ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణ మాట్లాడుతూ ఫ్యాక్టరీ పనులు నిలిపివేసే విధంగా తాను చొరవ చూపుతానని హామీ ఇచ్చారు. మంత్రి సీతక్కతో చర్చించి ఫ్యాక్టరీ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అవసరమైతే ఉద్యమకారులను సీఎంతో భేటీ చేయిస్తానని పేర్కొన్నారు. అప్పటి వరకు ఫ్యాక్టరీ పనులు కూడా కొనసాగకుండా చూసే బాధ్యత తీసుకుంటానని అన్నారు. 56 రోజుల నుండి రిలే నిరాహారదీక్షలు చేస్తున్నా ఏ ఒక్క స్థానిక నాయకులు వచ్చి సంఘీభావం తెలిపిన దాఖలాలు లేవని, ముందుగా ఉద్యమకాలకు సంఘీభావం తెలిపి, దిశానిర్దేశం చేసిన ఆత్రం సుగుణకు రైతులు, ఉద్యమకారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆమె వెంట కిసాన్ కాంగ్రెస్ నాయకులు బోరంచు శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయకుని నిమజ్జనం

- పరిశీలించిన రామగుండం పోలీస్ కమిషనర్



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని వివిధ గ్రామాల్లో కొలువుదీరిన గణేష్ నిమజ్జన వేడుకలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలోని వినాయక మండపాలలో నిర్వాహకులు పూజారులతో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మండపాల వద్ద లడ్డూ వేలంపాటలు నిర్వహించారు. సాయంత్రం వేళలో డప్పు చప్పులతో ఊరు జనాలంతా కలిసి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సమీప గోదావరిలో బాయ్ బాయ్ గణేష్ అంటూ వినాయకుడిని నిమజ్జనం చేశారు. మంచిర్యాల, జగిత్యాల జిల్లాల సరిహద్దులో గల గూడెం రాయపట్నం వంతెన వద్ద స్థానిక అధికారులు ఏర్పాటు చేసిన నిమజ్జన ఏర్పాట్లను రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. గణేష్ నిమజ్జనం వేడుకలు ఊరేగింపు కార్యక్రమాలు సిసి కెమెరాల పర్యవేక్షణలో ఉంటాయని, ప్రజలు శాంతియుత వాతావరణంలో నిమజ్జనం జరుపుకునేందుకు సహకరించాలని కోరారు. నిమజ్జనానికి వాహనాల్లో వచ్చే మహిళలు, చిన్నపిల్లల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. నిమజ్జనం కోసం హైమాస్ట్ లైట్లు, క్రేన్స్ ఫ్లాట్ ఫామ్స్ ఏర్పాటు చేశామని, మంచినీటి వసతి కూడా ఏర్పాటు చేశామని అన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే గజ ఈతగాళ్ళ కూడా అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. పోలీసులకు నిర్వాహకులు ఉత్సవ కమిటీ సభ్యులు సహకరించాలని కోరారు. ఊరేగింపు సమయంలో డీజేలు బాణసంచ కాల్చడం వంటి నిషేధమని, చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట స్పెషల్ బ్రాంచ్ ఏసిపి రాఘవేంద్రరావు, మంచిర్యాల ఏసిపి ఆర్.ప్రకాష్, లక్షెటిపేట సిఐ నరేందర్, మంచిర్యాల పట్టణ సిఐ బన్సీలాల్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, ఎంపీడీవో ప్రసాద్, లక్షెట్టిపేట ఎస్ఐ సతీష్, దండేపల్లి ఎస్ఐ ఉదయ్ కిరణ్ ఉన్నారు.

టెండర్లు రద్దు చేయాలి

18న కలెక్టరేట్ ఎదుట ధర్నా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా అమలవుతున్న పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చేలా పిలిచిన టెండర్లను రద్దు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు వెంకటనారాయణ అన్నారు. సోమవారం పట్టణంలోని టీఎన్జీవోస్ భవనంలో కార్మిక సంఘాల నాయకులతో కలిసి రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని సంఘాల ప్రతినిధులు తీర్మానించారు. అదే విధంగా ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల 18న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు వెంకటనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం కార్మిక శాఖ సంక్షేమ బోర్డు ద్వారా అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. కానీ ఇప్పుడు దాన్ని ప్రయివేటు సంస్థలకు అప్పగించేలా టెండర్లను పిలుస్తోందని, దాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల సాధన కోసం జేఏసీ పని చేస్తుందన్నారు. ఉద్యమాల్లో భాగంగా ఈ నెల 18న కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయడానికి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు అన్నమొల్ల కిరణ్, ఆశన్న, సుభాష్, నితిన్, జగన్, వాసు, దేవిదాస్, నర్సింగ్, వెంకట్రావ్, హన్మండ్లు, సుమన్, వామన్ పాల్గొన్నారు.

విచ్ఛిన్నకర శక్తుల నుండి దేశాన్ని కాపాడాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి
- సీతారాం ఏచూరికి ఘన నివాళులు



నవతెలంగాణ-జైపూర్

మతోన్మాద విచ్ఛిన్నకర, కార్పొరేట్ శక్తుల దోపిడీ నుండి దేశాన్ని కాపాడటమే సీతారాం ఏచూరికి ఘనమైన నివాళి అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. చెన్నూర్ పట్టణంలోని తాపీమేస్త్రీ భవనంలో జిల్లా కమిటీ సభ్యులు బోడంకి చందు అధ్యక్షతన సోమవారం పార్టీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా సంకె రవి మాట్లాడుతూ సీతారాం ఏచూరి మృతి దేశ ప్రజలకు, కష్టజీవులకు, ఉద్యమాలకు తీవ్ర నష్టమన్నారు. నమ్మిన సిద్ధాంతాన్ని ఆచరణలో పెడుతూ దేశాభివృద్ధికి తన జీవిత కాలమంతా పని చేశారని కొనియాడారు. రాజ్యసభ సభ్యుడిగా ఉండి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించే విధంగా పోరాటాలు రూపొందించే శక్తిగా ఆయన పని చేశారని పేర్కొన్నారు. సామాజిక తరగతులకు అండగా నిలబడిన ఏచూరి ఆశయ సాధనలో ప్రతి ఒక్కరు ముందుకు రావాలని, ఆయన కృషిలో భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు. సీపీఐ, ఐఎఫ్‌టీయూ, ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ వివిధ ప్రజా సంఘాల నాయకులు సీతారాం ఏచూరీ చేసిన కృషిని కొనియడారు. ఆయన బాటలో పయనించడమే ఆయనకు మనమిచ్చే ఘనమైన నివాళని అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) కార్యదర్శివర్గ సభ్యురాలు దాసరి రాజేశ్వరి, సీపీఐ చెన్నూర్ మండల నాయకులు నెన్నల సమ్మయ్య, సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి గోపీనాథ్, ఎంఎస్‌పీ నియోజకవర్గ కోఆర్డినేటర్ మంత్రి మల్లేష్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు చకినారపు మల్లేష్, నాయకులు వేముల రమేష్, సీఐటీయూ జిల్లా నాయకులు కావిరి రవి, మహిళా సంఘం మండల కార్యదర్శి బోగె నాగజ్యోతి, ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి సిడాం సమ్మక్క, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాతిపల్లి నగేష్, మత్స్యకారుల సంఘం నాయకురాలు తుమ్మ రేణుక, సీపీఐ(ఎం) శాఖ కార్యదర్శి బోన్ల సరిత, వివిధ సంఘాల నాయకులు మధుకర్, కృష్ణమాచారి, రమాదేవి, సహాన బేగం, యామిని, సత్యం పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్ ఉత్పత్తితో ప్రజలకు ఎంతో మేలు

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు



నవతెలంగాణ-దండేపల్లి

ప్రతి గ్రామానికి విద్యుత్ అందించాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సోలార్ విద్యుత్ ఉత్పత్తి పైలెట్ ప్రాజెక్టు కింద మండలంలోని వెల్గనూర్ గ్రామం ఎంపిక కావడంతో సోమవారం ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, రైతులకు నిరంతర విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం సోలార్ విద్యుత్ పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని, పైలట్ ప్రాజెక్టు కింద వెల్గనూర్ గ్రామం ఎంపికవ్వడం చాలా సంతోషకర విషయమని పేర్కొన్నారు. సోలార్ విద్యుత్ పథకం కింద ప్రతి ఇంటికి, పంట పొలాలకు విద్యుత్ కనెక్షన్ అందుతుందని తెలిపారు. దీని ద్వారా రైతులకు, ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, మిగులు విద్యుత్ తిరిగి అమ్ముకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అధికారులు అలసత్వం వహించకుండా పథకం పకడ్బందీగా అమలు జరిగేందుకు పనిచేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామస్తులు స్థానిక నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాహిత్యంలో కవుల పాత్ర ఎంతో కీలకం

- కవి, రచయిత బెల్లి యాదయ్య
- ప్రముఖకవి ఉదారి నాగదాసు స్మారక అవార్డు ప్రదానోత్సవం



ఉదారి నాగదాసు తత్వాల సీడీ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సాహిత్యంలో కవుల పాత్ర ఎంతో కీలకమని నల్గొండకు చెందిన కవి, రచయిత, పరిశోధకుడు బెల్లి యాదయ్య అన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని జడ్పీ సమావేశ మందిరంలో ప్రముఖకవి ఉదారి నాగదాసు స్మారక అవార్డు ప్రదానోత్సవం జరిగింది. అవార్డు స్వీకరించిన అనంతరం యాదయ్య మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లాలో గొప్ప కవులు చాలా మంది ఉన్నారని, సామాజిక సమస్యలపై స్పందిచి మంచి రచనలు చేస్తున్నారని తెలిపారు. ఉదారి నాగదాసు సాంఘిక విప్లవకారుడని కొనియాడారు. ఉదారి నాగదాసు రచించిన కవితలు ఇప్పటికీ పల్లెల్లో వినిపిస్తాయన్నారు. అలాంటి వ్యక్తి పేరున పురస్కారం పొందడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. కవులు సమాజంలోని సమస్యలతో పాటు ఇతర వాటిపై కవితలు, రచనలు చేస్తూ వారి స్థానాన్ని పెంచుకుంటున్నారని తెలిపారు. అవార్డు ప్రదానం చేసిన ఉదారి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ముందుగా ప్రముఖ తత్వకవి ఉదారి నాగదాసు రాసిన తత్వాల సీడీని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ ఇన్ ట్రెనింగ్ టీమ్ అధికారి డా.నరేందర్ రాథోడ్‌తో పాటు పలువురు అతిథులతో కలిసి ఆవిష్కరించారు. ముఖ్యాతిథిగా హాజరైన డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ నీతివంతమైన సమాజ నిర్మాణానికి తన వంత ప్రయత్నం చేస్తున్నానని తెలిపారు. పూర్వం శతక కవులు సులభమైన భాషలో పద్యాలు రాసి మనిషిలో ఉన్నత విలువలను పెంచే ప్రయత్నం చేశారని కొనియాడారు. ఈ తత్వ కవులు వారికంటే మరింత సులువైన భాషలో తత్వాలు రాసి నీతివంతమై సమాజన్ని తీర్చిదిద్దే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. నాగదాసు పాటలు ఈ ప్రాంతంలో ఊరూరా భజన మండల్లో పాడుకుంటారని, ఆయన పేరుమీద మంచి కవికి అవార్డు ఇవ్వడం ఉదారి కుటుంబం గొప్పతనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు నేరెళ్ల రంగాచార్య, రచయిత విప్లవ్ కుమార్, వాగ్గేయకారుడు చింతల యాదగిరి, విశ్రాంత ఉద్యోగులు ఎం. స్వామి, అనంత్వార్ నిశికాంత్, నిర్వాహకులు ఉదారి కృష్ణమాచారి, ఉదారి నారాయణ, శేషన్న, కవులు వసంత్‌రావు దేశ్‌పాండే, సామల రాజవర్ధన్, సంతోష్, చరణ్‌దాస్, సాయిప్రియ, సుమనస్పతిరెడ్డి, మన్నె ఏలియా, డా.మన్నే ప్రభాకర్, రామకృష్ణ, వేణుగోపాల్‌రెడ్డి, లెనిన్ పాల్గొన్నారు.



యాదయ్యకు అవార్డు ప్రదానం

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
మంగళవారం | సెప్టెంబర్ 17, 2024 | www.navatelangana.com

ఆర్టీసీ బస్సులో చోరీ

నవతెలంగాణ-ముధోల్

బాసర నుంచి భైంసా వెళుతున్న ఆర్టీసీ బస్సులో సోమవారం దొంగతనం జరిగింది. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికులకు చెందిన మూడు ఫోన్లు దొంగలు దొంగలించారు. దీంతో



బాధితులు ఆలస్యంగా గమనించి, వెంటనే బస్సు డ్రైవర్‌కు తెలిపారు. డ్రైవర్ వెంటనే బస్సును ముధోల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. పోలీసులు బస్సులో ఉన్న ప్రయాణికులను తనిఖీ చేశారు. అయినప్పటికీ చోరీకి గురైన ఫోన్‌లు దొరకలేదు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తి వచ్చే రూట్లో ఎక్కడైనా దిగి ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు.

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

టీపీసీసీ అధ్యక్షునిగా మహేష్‌కుమార్‌గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం గాంధీ భవన్‌లో నిర్వహించిన మహేష్ కుమార్‌గౌడ్ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో పాల్గొని పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి, అభినందనలు తెలియజేశారు.



పారిశుధ్యం సక్రమంగా ఉంటే వ్యాధులు దూరం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పారిశుధ్యం సక్రమంగా ఉంటే వ్యాధులు దరిచేరవని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి కృష్ణ తెలిపారు. సోమవారం పట్టణంలోని హమాలివాడలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చిలుకూరి లక్ష్మీనగర్‌లోని పీహెచ్‌సీలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డా.కృష్ణ మాట్లాడుతూ ఇంటి బయట ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. మురుగునీరు ఆగకుండా ఉండేవిధంగా చూడాలన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రికార్డులను పరిశీలించారు. సిబ్బంది గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. డ్రైడే కార్యక్రమాలు ఓపీ సేవలు, ఫీవర్ సర్వే ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణ అధికారి, జిల్లా ఎన్సీడీ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ శ్రీధర్ మెట్‌పెల్లివార్, ల్యాబ్ టెక్నీషియన్ బండారి కృష్ణ పాల్గొన్నారు.

నిజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాటాలు : సీపీఐ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హైదరాబాద్ సంస్థానంలో నిజాం నవాబు ఆగడాలకు వ్యతిరేకంగా సీపీఐ పోరాటాలు నిర్వహించిందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలు నళినిరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని రామ్‌నగర్ కాలనీలో సీపీఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట 76వ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సీపీఐ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పేదవారిని వెట్టి చాకిరి చేయించిన రోజుల్లో పేద ప్రజలకు సీపీఐ అండగా ఉంటూ భూపోరాటాలకు పిలుపునివ్వడం జరిగిందని తెలిపారు. రావి నారాయణరెడ్డి, ముగ్ధూం మొయియోద్దీన్, బద్దం ఎల్లారెడ్డి తెలంగాణ రైతంగ సాయుధ పోరాటానికి పిలుపు ఇవ్వడంతో ప్రజలు భూస్వాములై, నిజాం సర్కారుపై పోరాటం చేసి విజయం సాధించిన తర్వాత తెలంగాణ భారత దేశంలో విలీనం చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటల రాములు, జిల్లా నాయకులు షేక్ బాషా, అర్ధాంగి రమేష్, అమీనా బేగం, వైరాగడె కాంతాబాయి, సుభాష్, ఆనంద్, కిషన్ పాల్గొన్నారు.

శాంతిమార్గంలో పయనించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహ్మద్ ప్రవక్త చూపిన శాంతిమార్గంలో పయనించాలని ఖానాపూర్ జోహర మసీద్ ఇమామ్ ముఫ్తి మహ్మద్ జాకీర్ హుస్సేన్ అన్నారు. సోమవారం ప్రవక్త జయంతిని పురస్కరించుకొని మిలద్ ఉన్ నబి వేడుకలను పట్టణంలోని జహుర మసీద్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవక్త చూపిన మార్గాన్ని తెలియజేస్తు ప్రతి ఒక్క ముస్లిం అనుసరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఇమామ్ ముఫ్తి మహ్మద్ జాకీర్ హుస్సెన్ మాట్లాడుతూ ప్రపంచానికి దిశానిర్దేశం చేసిన మహ్మద్ ప్రవక్త మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. శాంతి మార్గంలో జీవించాలన్నారు. అదే విధంగా భారతదేశంలో సోదరభావం పెంపొందేలా దేవున్ని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అబుజర్, జమీర్, సమీర్, మున్న, అయ్యూబ్, ముజీబ్ ఉన్నారు.

స్నానానికి వెళ్లిన వ్యక్తి మృతి

నవతెలంగాణ-సారంగాపూర్

స్వర్ణ వాగులో స్నానానికి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందిన సంఘటన మండలంలోని ఆలూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలూరు గ్రామానికి చెందిన చందాల గణపతి(41) వాళ్ల దగ్గరి బంధువు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి పెద్దకర్మకు వెళ్లి గ్రామ సమీపంలో గల స్వర్ణ వాగులో సాయంత్రం స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. మృతుని కుటుంబీకులు సోమవారం పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, జాలరుల సాయంతో మృత దేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ జిల్లా ఆస్పత్రికి తరలించినట్టు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మృతునికి భార్య గంగామణి ఉన్నారు.

జీవితాన్ని అంకితం చేసిన సీపీఐ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

తెలంగాణ సాయుధ పోరాటం 1969 లో సాయిధ పోరాటం జరిగిందని కమ్యూనిస్టు అగ్ర నాయకులు కామ్రేడ్ రవి నారాయణరెడ్డి మగ్దూం మోయుద్దిన్ 1969 లో ఎన్నో పోరాటాలు చేసి భూమి భుక్తి కోసం తమ జీవితాన్ని అంకితం చేశారని సీపీఐ పార్టీ సీనియర్ నాయకులు కుంటాల రాములు అన్నారు. సోమవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల వార్షికోత్సవాల్లో భాగంగా పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ 170 కాలనీలో వార్షికోత్సవాలు నిర్వహించారు. దీనికి సిపిఐ సీనియర్ నాయకులు ఎస్ కే పాషా హాజరై సిపిఐ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా కుంటాల రాములు మాట్లాడుతూ.. కష్టాల రామకష్ణ బోలాన్ వార్, దాది శంకర్ ఎన్నో పోరాటాలు చేసి ప్రభుత్వ భూములు పంచి పెట్టారని తెలిపారు. స్వాతంత్ర సమరయోధుల త్యాగాలు మరువలేనని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అద్దంకి రమేష్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు కామ్రే రామదాసు, ఖండేలా గణేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సీపీఐ నాయకులు దత్తు ఉన్నారు.

బీజేపీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. సోమవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాల్లో భాగంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ ప్రధాన వీధుల గుండా సాగి తిరిగీ పార్టీ కార్యాలయం సుందరయ్య భవనం వరకు చేరుకుంది. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా, రాజాకార్ గుండాలకు, దేశ్‌ముఖ్ భూస్వాములకు వ్యతిరేకంగా భూమికోసం, భుక్తికోసం, వెట్టిచాకిరి విముక్తికోసం 1946 నుంచి 1951 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగిందని అన్నారు. ఈ పోరాటాన్ని బీజేపీ మతాల మధ్యన జరిగిన పోరాటంగా వక్రీకరించి రాజకీయ లబ్ధిపొందే ప్రయత్నం చేస్తుందన్నారు. బీజేపీ రాజకీయ ఎత్తుగడలను తెలంగాణ ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య హిందువూ అయితే, అదే పోరాటంలో అమరులైన షేక్ బందగీ, షోయబుల్లాఖాన్, వీరోచిత పోరాటం నడిపిన మగ్దూం మొహినుద్దీన్‌లది ఏ మతమని ఆయన ప్రశ్నించారు. నిజం నవాబు, ఖాసీం రజ్వీ ముస్లింలు అయితే ఆయన ఆస్థానంలో జాగీరు దారులుగా భూస్వాములుగా చెలామణి అవుతూ, ప్రజల, మన ప్రాణాలను తీసిన దేశముఖ్, విస్నూర్ రామచంద్రారెడ్డి లాంటి వారు హిందువులు అని గుర్తు చేశారు. ప్రజలను దోపిడీ చేసిన వారిలో హిందూ, ముస్లిం భూస్వాములున్నారని వారినీ ఎదిరించి పోరాడిన వారిలో హిందూ, ముస్లిం ప్రజలు ఉన్నారని అన్నారు. ఈ పోరాటం భూమికోసం, భుక్తి కోసం జరిగిన పోరాటం తప్ప హిందూ, ముస్లింల మధ్య జరిగినది కాదని అన్నారు. ఈ వాస్తవ సత్యాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. ఒక గొప్ప వర్గ పోరాటాన్ని మతం రంగు పులిమి, లబ్దిపొందే ప్రయత్నంలో భాగంగా బీజేపీ ఆ పోరాటం చరిత్రను వక్రీకరిస్తోందని మండిపడ్డారు. ఇకనైనా బీజేపీ తన ఓట్ల రాజకీయం కోసం చరిత్రను మార్చే కుట్రను మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు లంక రాఘవులు, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.మంజుల, బొజ్జ ఆశన్న, ఆత్రం కిష్టన్న, నాయకులు ప్రభు, ప్రజాసంఘాల నాయకులు లింగాల చిన్నన్న, లంక జమున, శకుంతల, విజయ, ఎస్.స్వామి, ఆశన్న, ఆర్.సురేందర్, పండగ పొచ్చన్న, దేవిదాస్, రమాకాంత్, టి.సురేష్ పాల్గొన్నారు.



డెంగ్యూ నివారణకు చర్యలు చేపట్టాలి



నవతెలంగాణ-తాంసి

గ్రామాల్లో డెంగ్యూ వ్యాధి నిర్మూలనకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్.సాధన గ్రామస్తులకు సూచించారు. సోమవారం తాంసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తాంసి(కె) గ్రామంలో డెంగ్యూ కేసు నమోదు కావడంతో ఆరోగ్య సిబ్బంది అప్రమత్తమై గ్రామంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాధన మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి రాకుండా ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఇంటి పరిసరాలు మురుగు నీరు నిల్వకుండా చూసుకోవాలని అన్నారు. ఎవరైనా అనారోగ్యం బారిన పడిన వెంటనే ఆశ వర్కర్‌ను సంప్రదించాలని అన్నారు. లేదా ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్సలు చేయించుకోవాలన్నారు. ఆరోగ్య సిబ్బంది వర్షాకాలంలో ప్రతి గ్రామంలో ఆరోగ్య క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. డెంగ్యూ సోకిన రోగులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రావ్యవాణి, సూపర్‌వైజర్ తులసిరామ్, ఆరోగ్య సిబ్బంది వసంతకుమారి, ఆశ కార్యకర్త ఉన్నారు.

హిందీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హిందీ దినోత్సవ పక్షోత్సవాల్లో భాగంగా 20న జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరగనున్న హిందీ దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, హిందీ భాషా సేవా సమితి జిల్లా అధ్యక్షులు సుకుమార్ పేట్కులే పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలోని పూలే గెస్ట్ హౌస్‌లో సంఘ సభ్యులతో కలిసి మాట్లాడారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. హిందీ దినోత్సవ వేడుకలకు హిందీ సాహితీవేత్తలు, ఆదిలాబాద్ ఎంపీ, ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, జిల్లా విద్యాశాఖ అధికారి, జెడ్పీ సీఈఓ, సాహితివేత్తలు పాల్గొననున్నట్టు తెలిపారు. ఇటీవల పదోన్నతి పొందిన వంద మంది హిందీ ఉపాధ్యాయులని ఈ సందర్భంగా సన్మానించనున్నామని, అలాగే విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన, పాటల పోటీలు



నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి వచ్చే ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులను వెంట తీసుకొచ్చి ఆయా పోటీల్లో పాల్గొనేలా చేయాలని, విజేతలకు బహుమతులు ప్రధానం ఉంటుందని తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ ద్రోణాలే, ఉపాధ్యక్షులు ఆర్.సాంబన్న షిండే, ఎస్.శ్రీహరి, కోశాధికారి చంద్రశేఖర్ అంబేకర్, కార్యదర్శి జావిద్ అలీ, కార్యవర్గ సభ్యులు ప్రధాన్ భాస్కర్, నల్వాల రమేష్, తెలంగ్ గణేష్, కాలే శ్రీనివాస్, భీమ్‌రావు పాల్గొన్నారు.

వినాయకుని పూజలో ఎమ్మెల్యే దంపతులు



నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట కొలువుదీరిన గణనాథుడికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ధ్రుపత కుటుంబ సమేతంగా వినాయకునికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అయన సతీమణితో కలిసి అన్నదాన కార్యక్రమం ప్రారంభించి, భక్తులకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సకల విఘ్నాలను హరించే గణనాథుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ప్రజలపై ఉండాలని కోరారు. విశ్వంలోని సకల జీవరాసులు ఆయురారోగ్యాలతో పాడిపంటలు బాగా పండాలని ఆ గణనాథుడిని ఎమ్మెల్యే దంపతులు వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

తాంసి : గత తొమ్మిది రోజులుగా తాంసి, భీంపూర్ మండల కేంద్రంతో పాటు మండలాల్లోని ఆయా గ్రామాల్లో గణేష్ విగ్రహాలను ప్రతిష్టించుకున్నారు. ఎంతో భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించి, ఆదివారం రోజుతో తొమ్మిది రోజులు కావడంతో ఆయా గ్రామాల్లోని గణేష్ విగ్రహాలకు చివరి పూజా కార్యక్రమాలు నిర్వహించి, నిమజ్జనానికి డీజే బ్యాండ్ వాయిద్యాల నడుమ నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా తీసుకువెళ్లి సమీప వాగుల్లో నిమజ్జనం చేశారు.

ఆదిలాబాద్‌టౌన్ : పట్టణంలో వినాయక నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుని మంగళవారం కిరాణా మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సంఘం ప్రతినిధి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి గంద్రత్ సంతోష్ తెలిపారు. సోమవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల ఆయన మాట్లాడారు. శోభాయాత్ర సందర్భంగా వ్యాపార సంస్థలు హోటళ్లు మూసి ఉంటాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలు పట్టణ నలుమూలల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. భక్తులు ప్రజలు అన్న ప్రసాదాన్ని స్వీకరించి, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు కమల్ కిశోర్ అగర్వాల్, గోవింద్ దోమకొండవార్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఏకగ్రీవంగా ఎన్నిక



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని డా.బీఆర్ అంబేద్కర్ భవనంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం నిర్వహించిన జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికకు రాష్ట్ర అధ్యక్షులు కొంగల వెంకట్ పాల్గొన్నారు. ఆయన ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం వారిని శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షులుగా కూర పొచ్చన్న, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కాంబ్లె లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షులుగా రాచర్ల నారాయణ, కోశాధికారిగా మోర వెంకట్, జిల్లా గౌరవాధ్యక్షులుగా సూర్యవంశం, జిల్లా కార్యదర్శులుగా రాథోడ్ మదన్‌లాల్, గెడం నాగరావు, మహిళా కార్యదర్శిగా దూలూరి అనురాధ, సభ్యులుగా దర్శనాల భాగ్యవతి, శ్రీకాంత్, అట్ల అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పెంటపర్తి ఊశన్నను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ మారుపాక భీమయ్య, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు రమేష్, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు బాధవత్ ప్రవీణ్ నాయక్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నవతెలంగాణ-కుభీర్



రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పల్సి గ్రామానికి చెందిన రాజారాం(27) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. రాజారాం, పరుశురాం ఇద్దరు కలిసి పల్సి నుంచి కుభీర్‌కు పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కుభీర్ మండల కేంద్రమైన పెట్రోల్ పంపు వద్ద మహేంద్ర టాటా మ్యాక్స్ ఎదురేదురుగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో రాజారాం(27)కు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. దింతో పరుశురాంకు గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించినట్టు ఎస్సై రవీందర్ తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-సిరికొండ

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం రాత్రి లక్కంపూర్ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామని అన్నారు. లక్కంపూర్ గ్రామంలో మొదటి విడతలోనే ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులకు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని అన్నారు. రుణమాఫీ విషయంలో రైతులెవరూ ఆందోళన చెందొద్దని అన్నారు. ప్రతి రైతుకి రుణ మాఫీ అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఇమామ్, నాయకులు అమృత్‌రావ్, గుణవంత్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గణపతి లడ్డూ రూ.31,116



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా వ్యాప్తంగా గణేష్ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనిలో ఏర్పాటు చేసిన ఫ్రెండ్స్ గణేష్ మండల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లడ్డును ఆదివారం వేలం వేశారు. గత 9రోజుల పాటు గణేషుడిని భక్తి శ్రద్ధలతో కొలిచారు. నిమజ్జన రోజు గణేషుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం లడ్డు వేలం నిర్వహించగా రూ.5వేల నుంచి ప్రారంభమైంది. హోరాహోరీగా సాగిన వేలంపాటలో చివరగా కాలనీకి చెందిన ముత్యాల కృష్ణకాంత్ రూ.31వేల116లకు లడ్డును దక్కించుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులు ప్రత్యేకపూజలు నిర్వహించి లడ్డును ఊరేగింపుగా ఇంటికి తీసుకెళ్లారు.

కేజీబీవీలో అధ్యాపకులను నియమించాలి

నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ మండల కేంద్రంలోని కేజీబీవీలో అధ్యాపకులను నియమించాలని ఎఎస్‌యూ ప్రధాన కార్యదర్శి పెందూర్ సంతోష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇంటర్ విద్యార్థినులు విషయాల వారీగా చాలా నష్టపోతున్నారని తెలిపారు. కళాశాలలో కేవలం తెలుగు మ్యాథ్స్ ఇద్దరే అధ్యాపకులు ఉన్నారని, మిగతా విషయాల వారీగా అధ్యాపకులను నియమించాలని పేర్కొన్నారు. వార్షిక పరీక్షలు కొన్ని నెలల్లోనే ఉన్నాయని ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

పశువులను అక్రమ రవాణ చేస్తే చర్యలు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

పశువులను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కమలాకర్ హెచ్చరించారు. మహారాష్ట్ర నుండి నిజామాబాద్‌కు నాలుగు వ్యాన్లలో అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకొని కాగజ్‌నగర్ గోశాలకు తరలించారు. ఈ సందర్భందగా ఎస్సై మాట్లాడుతూ అక్రమంగా పశువులను తరలిస్తున్న 4 వ్యాన్ లను పట్టుకోని 11 మందిపై కేసు నమోదు చేశామన్నారు. సమాచారం మేరకు వాహనాలను తనిఖీ చేస్తుండగా 4 వ్యాన్‌లను తనిఖీ చేయడంతో అందులో 64 పశువులున్నట్టు



గుర్తించామన్నారు. పశువుల రవాణ చేస్తున్న నలుగురు డ్రైవర్లు, నలుగురు ఓనర్లు, ఇద్దరు క్లీనర్లు, ఒక పశువుల యజమాని సలీం ఖురేషీ(నాగ్‌పూర్), షేక్ తౌసిఫ్, షేక్ సోహైల్, షేక్ తౌహీద్, మోసిన్ ఖాన్, షేక్ నదీమ్, సచిన్, రాంటెంకి శైలేష్, షేక్ హనీస్, రమేష్ కుమార్, ఎండీ.యూనిస్‌లపై కేసు నమోదు చేసామని పేర్కొన్నారు.

గణేష్ మండలి వద్ద ఫ్యాషన్ షో

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని బాపునగర్ శారద గణేష్ మండలి వద్ద ఆదివారం రాత్రి చిన్నారులకు ఫ్యాషన్ షో నిర్వహించారు. పోటీలలో 20 మంది వరకు చిన్నారులు పాల్గొనగా జైనూరు సీఐ రమేష్ న్యాయ నిర్ణేతగా నిలిచి విజేతలను ప్రకటించారు. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించిన ఫ్యాషన్ షోలో విజేతగా నిలిచి మొదటి బహుమతి పుల్లూరు గాయత్రి పొందగా ద్వితీయ బహుమతి అనుశ్రీ, తృతీయ బహుమతి శ్రీమాన్ పొందారు. కార్యక్రమంలో నిర్వాహణ కమిటీ సభ్యులతో పాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అడ గ్రామంలో చోటు చేసుకుంది. సీఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన హుడె గంగుబాయి తన ఇంట్లో ఉరేసుకుంది. భార్య భర్తల మధ్య గొడవ జరగగా భర్త లక్ష్మణ్ కోప్పడడంతో మనస్థాపానికి గురై ఆయన ఇంట్లో నుండి బయటికి వెళ్లిన తర్వాత ఫ్యాన్‌కు ఉరేసుకుని చనిపోయింది. మృతురాలికి ఇద్దరు సంతానం ఉండగా, భర్త లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు గణేష్ నిమజ్జనం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లో మంగళవారం గణేష్ నిమజ్జన కార్యక్రమం చేపట్టనున్నారు. ఇందుకు గాను పట్టణానికి సమీపంలోని పెద్దవాగు మున్సిపల్ పంప్ హౌజ్ వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. ప్రతి రోజు అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. సోమవారం సిర్పూరు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్దా శుక్లా వేర్వేరుగా పెద్దవాగు ప్రాంతాన్ని పరిశీలించారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీష్‌బాబు కమిషనర్ అంజయ్యకు సూచించారు. కాగా సాయంత్రం సబ్ కలెక్టర్ శ్రద్దా శుక్లా పెద్దవాగు ప్రాంతానికి వెళ్లి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు ఆమెకు తీసుకున్న చర్యల గురించి వివరించారు. ఇప్పటికే పోలీసులు పలు సార్లు గణేష్ మండళ్ల నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించారు. పట్టణంలోని అన్ని గణేష్ మండళ్ల నిర్వాహకులు మధ్యాహ్నం మూడు గంటల వరకు ఖచ్చితంగా గణేష్ విగ్రహాలను తీయాలని సూచించారు.

రోడ్డుకు మరమ్మత్తులు చేయాలి

నవతెలంగాణణ-వాంకిడి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సవాతి గ్రామంలోని డాబా అప్రోచ్ రోడ్డు చెడిపోయిందని మరమ్మతులు చేయాలని మాజీ సర్పంచ్ దేవ్ రావు డిమాండ్ చేశారు. ప్రస్తుతం చెడిపోయిన రోడ్లతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మత్తులు చేయాలని ఆయన కోరారు.

నేటి ప్రజాపాలన వేడుకలు విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేడు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలో నిర్వహించే ప్రజాపాలన దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.45 నిమిషాలకు శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరై పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తారు. 10 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరిస్తారు. అనంతరం అభివృద్ధిపై ప్రసగించి జాతీయ గీతాలపాన అనంతరం కార్యక్రమం ముగుస్తుంది.

పోచమ్మ ఆలయానికి భూమి పూజ



నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయ నిర్మాణానికి సోమవారం భక్తులు భూమి పూజ చేశారు. గతంలో ఉన్న పోచమ్మ ఆలయం శిథిలావస్థకు చేరడంతో దాతల సహకారంతో పోచమ్మ ఆలయాన్ని నిర్మించడానికి ముందుకు వచ్చినట్లు పోచమ్మ ఆలయ నిర్మాణ కమిటీ తెలిపింది. దాతల సహకారంతో ఆలయాన్ని పూర్తి చేస్తామని వారు తెలిపారు. ఈ మేరకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు కొండవీటి భాస్కర్, రాజు, సూర్ల ఇస్తారి, కనికుంట్ల శ్రీనివాస్, బాలయ్య, సురేష్ పాల్గొన్నారు.

బాల్ బాడ్మింటన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా తిరుపతి

నవతెలంగాణ-రెబ్బెన



తెలంగాణ రాష్ట్ర బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా గోలేటి గ్రామానికి చెందిన సోమారం తిరుపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో రాష్ట్ర నూతన కమిటీ ఏనుకోవడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర కమిటీలో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా బాల్ బాడ్మింటన్ అసోసియేషన్‌కు చెందిన సోమారం తిరుపతిని రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు రాష్ట్ర అధ్యక్షులు బంగారు స్వామి, ప్రధాన కార్యదర్శి రమణ ప్రకటించారు. తన ఎంపికకు సహకరించిన ఆర్.నారాయణ రెడ్డి, షార్ప్ స్టార్ బాల్ బాడ్మింటన్ అసోసియేషన్, రాష్ట్ర అసోసియేషన్ సభ్యులకు ధన్యవాదములు తెలిపారు.

నేటి నుండి సేవా పక్వాడ కార్యక్రమం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని నేటి నుండి వచ్చే నెల రెండో తేది వరకు నిర్వహించే సేవ పక్వాడ కార్యక్రమాలను విజయవంతం చేయాలని మాజీ జడ్పీటీసీ, కార్యక్రమ ఇన్‌చార్జి అరిగెల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాయకులు పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పేర్కొన్నారు.

సేవలు ఘనం.. ఫలితం శూన్యం

- ఆర్థిక ఇబ్బందుల్లో అవుట్ సోర్సింగ్ సిబ్బంది
- పెండింగ్ వేతనాలకు ఎదురుచూపు
- సమాధానం లేని ప్రశ్నగా మిగిలిన వైనం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రస్తుత పరిస్థితుల్లో పని దొరకడమే కష్టంగా మారుతున్న తరుణంలో స్థానికంగా దొరుకుతున్న పనిపై ఆధారపడి అనేక మంది జీవిస్తున్నారు. ఇలాగే అటవీ శాఖలో అవుట్ సోర్సింగ్ విధానంలో ఎనిమల్ ట్రాకర్లను, బేస్ క్యాంపు వాచర్లను, డ్రైవర్లు, కంప్యూటర్ ఆపరేటర్లను తీసుకోవడానికి సిద్ధం స్థానికంగా ఉండే అనేక మంది ఇందులో చేరారు. అటవీ శాఖ సిబ్బందితో కలిసి ప్రతిరోజు అటవీ ప్రాంతాల్లో గస్తీ తిరుగుతున్నారు. అయితే ఐదు నెలల నుండి వేతనాలు రాక వీరుపడుతున్న ఇబ్బందులపై ప్రత్యేక కథనం.

జిల్లాలో ఇది పరిస్థితి

జిల్లాలోని అటవీ శాఖలో 11 రేంజీలు, రెండు డివిజన్లు ఉండగా వీటిలో పని చేయడానికి వివిధ రకాల క్యాడర్లలో 149 మందిని అవుట్ సోర్సింగ్ విధానంలో నియమించారు. ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలో 35 మంది ఎనిమల్ ట్రాకర్లను, 15 మంది బేస్ క్యాంపు వాచర్లను, 7 మంది డ్రైవర్లను, 7 మంది ఆపరేటర్లను తీసుకోగా, కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో 45 మంది ఎనిమల్ ట్రాకర్లు, 30 మంది బేస్ క్యాంప్ వాచర్లు, 5 మంది డ్రైవర్లు, 5 మంది ఆపరేటర్లు పనిచేస్తున్నారు.

సేవలు ఘనం ఫలితం శూన్యం

అటవీ శాఖలో ఖాళీలు వేధిస్తున్న నేపథ్యంలో ఒక్కో బీట్ అధికారి 2 నుండి 6 వరకు బీట్లలో విధులు నిర్వహిస్తుండగా ఒక్కో సెక్షన్ అధికారి రెండేసి చొప్పున సెక్షన్లలో విధులు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు జిల్లాలో ప్రత్యేకంగా ట్రాక్ నిర్వహిస్తున్నప్పటికీ అటవీ ప్రాంతం మొత్తం కవర్ చేయలేకపోతున్నారు. అటవీ ప్రాంతాల్లో కలియతిరగడానికి బేస్ క్యాంప్ వాచర్లు, ఎనిమల్ ట్రాకర్లు ఎంతగానో ఉపయోగపడుతున్నారు. అటవీ అధికారులతో కలిసి తిరుగుతున్నారు. అయిన వారి కష్టానికి ఫలితం లేకుండా పోతోంది.

ఐదు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు

అటవీ శాఖలో ఎన్నో సంవత్సరాల నుండి విధులు నిర్వహిస్తున్న వీరికి ఏప్రిల్ నెల నుండి జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. కాగజ్‌నగర్ డివిజన్‌లో మార్చి నెల జీతం వచ్చిన, ఆసిఫాబాద్ డివిజన్‌లో ఆ పరిస్థితి లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే కొన్ని రేంజ్‌లలో వ్యక్తిగతంగా రేంజర్లు డబ్బులు ఇస్తామని వాచర్లకు చెప్పగా, మరికొన్నిచోట్ల వారు విధులకు దూరంగా ఉన్నట్లు తెలిసింది. జీతాలకు సంబంధించి బిల్లులు చేసిన పెండింగ్‌లో ఉండటంతో తమ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోయారు.

సమాధానం లేని ప్రశ్నగా మిగిలిన వైనం

పది సంవత్సరాల నుండి అటవీ శాఖలో పనిచేస్తున్న తమకు ప్రస్తుతం గడ్డు పరిస్థితులు కలిగిన నేపథ్యంలో ఎవరిని అడగాలో తెలియని పరిస్థితి అవుట్ సోర్సింగ్ సిబ్బందికి నెలకొంది. ఏజెన్సీ నిర్వాహకులను అడగగా తమ ఏజెన్సీ కాలపరిమితి మార్చి వరకు పూర్తయిందని తెలుపుతున్నారు. జిల్లా అటవీ శాఖ అధికారిని జీతాలు చేశామని సమాధానం ఇచ్చారు. దీంతో తమ సమస్య సమాధానం లేని ప్రశ్నగా మిగిలిపోయిందని వాపోతున్నారు.

జీతాల బిల్లులు చేశాం

నీరజ్ కుమార్ టిబ్రేవాల్, జిల్లా అటవీశాఖ అధికారి



జిల్లాలో అటవీ శాఖలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందికి సంబంధించిన బిల్లులు ఎఫారెస్టేషన్ కింద ఇప్పటికే బుక్ చేసాం. త్వరలోనే పెండింగ్ బిల్లులు క్లియర్ అవుతాయి.

పెండింగ్ వేతనాలు చెల్లించి ఆదుకోవాలి

సాయి, బేస్ క్యాంప్ వాచర్

మార్చి నెల వేతనాలు రావడం లేదు. దీంతో



ఇల్లు గడవక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రతిరోజు విధులు నిర్వహిస్తున్న మా ఆవేదన వినకపోవడం బాధగా ఉంది. అధికారులు ప్రభుత్వం స్పందించి వేతనాలు చెల్లించాలి.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జివెంకటేశ్వర్ రెడ్డి



ఖైరిగూడ ఓసీ పరిసరాలను పరిశీలిస్తున్న ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలో పెండింగ్‌లో ఉన్న సివిల్ పనులను పూర్తి చేయాలని ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జివెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన బెల్లంపల్లి ఏరియాలో పర్యటించారు. ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ తో కలిసి ఖైరిగూడ ఓసీకి చేరుకున్నారు. ఇక్కడ ప్రాజెక్ట్ అధికారి కార్యాలయంలో ఉత్పత్తి వివరాలను అధికారులను తెలుసుకున్నారు. గనిలోకి వెళ్లి పని స్థలాలు, నిల్వ నీరు, పంపింగ్ వ్యవస్థను పరిశీలించారు. అనంతరం వట్టివాగును, కాపర్ డ్యాంని చూశారు. ఉల్లిపిట్ట, డోర్లి గ్రామాలకు వెళ్ళే మార్గంలో వాగుపై నిర్మిస్తున్న వంతెన పనులను పరిశీలించారు. వంతెన త్వరగా పూర్తి చేయాలని సివిల్ అధికారులకు ఆదేశాలిస్తు సూచనలు చేశారు. వెస్ట్ వ్యూ పాయింట్ నుండి ఖైరిగూడ ఓసీ పని స్థలాలు వీక్షించి పలు విషయాలను తెలుసుకున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలపై అధికారులు సిబ్బందికి మార్గ నిర్దేశం చేసి లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం కె.రాజమల్లు, ఖైరిగూడ పీఓ మచ్చగిరి నరేందర్, పీఓ ఎస్ ఉమాకాంత్, ఏరియా ఇంజినీర్ భీంరావ్ జాడే, ప్రాజెక్ట్ ఇంజినీర్ వీరన్న పాల్గొన్నారు.

మాలీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- మంత్రి సీతక్కకు వినతి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎన్నికల సమయంలో మాలీ కులస్తులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని మంత్రి సీతక్కకు హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మాలీలకు ఇచ్చిన హామీ నెరవేర్చాలని ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఆసిఫాబాద్ జిల్లాలో ఎక్కువగా మాలీ కులస్తులున్నారని వారికి ప్రత్యేక సంఘ భవనం నిర్మించాలని కోరారు. మాలీ కులస్తుల హక్కుల కోసం పోరాడిన మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలన్నారు. సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కారం కోసం కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో మాలీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నాగోసె శంకర్, ప్రధాన కార్యదర్శి జి.మారుతి, బీసీ సంఘం రైతు జిల్లా అధ్యక్షులు వైరాగడే మారుతి పటేల్, మాలీ సంఘం నాయకులు విశ్వనాథ్, సోమాజి పాల్గొన్నారు.



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందిస్తున్న మాలీ సంఘం నాయకులు

జిల్లాలో ఘనంగా నిమజ్జనోత్సవాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తొమ్మిది రోజులుగా భక్తుల పూజలు అందుకున్న వినాయకుడు సోమవారం నిమజ్జనానికి తరలివెళ్లాడు. తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్దలతో పూజలు చేసిన భక్తులు ప్రత్యేక వాహనంలో వినాయకుడిని ఉంచి శోభయాత్ర చేపట్టారు. డీజే, బ్యాండ్ మేళాల నడుమ నృత్యాలు చేస్తు ముందుకు సాగారు. సమీపంలోని చెరువులు, నదులు, వాగుల్లో వినాయకుడిని నిమజ్జనం చేశారు. కాగా బ్రాహ్మణవాడ గణపతి దేవాలయంలో ఏర్పాటుచేసిన వినాయకుని మెడలోని రూపాయల దండ రూపాయలు ఐదున్నర వేలకు దండ నాయకుల సతీష్ వేలంపాటలో దక్కించుకున్నారు

శారద గణేష్ మండలి వద్ద

స్థానిక బాపునగర్‌లోని శారద గణేష్ మండలి వద్ద నెలకొల్పిన వినాయకుని నిమజ్జనోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వినాయకుని వద్ద తొమ్మిది రోజులపాటు నిర్వహించిన వివిధ రకాల పోటీలకు సంబంధించి విజేతలకు నిర్వాహకులు బహుమతుల ప్రధానం చేశారు. నవరాత్రి వేడుకలు నిర్వహించడానికి ఆర్థికంగా సహకారం అందించిన పోతులూరి రాంప్రసాద్ గౌడ్ దంపతులను ఘనంగా సన్మానించడంతో పాటు తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న లడ్డును నిర్వాహకులు అందజేశారు. శోభాయాత్ర సందర్భంగా మహిళలు ప్రత్యేక దుస్తులతో వచ్చి చేసిన కోలాటం ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో గీత, మంగా, శ్రీనివాస్, ఆనంద్, మహేందర్, వివేక్, సుగుణాకర్ పాల్గొన్నారు.



రెబ్బెన : మండలంలోని గోలేటి గ్రామంలో గణేష్ నిమజ్జనోత్సవం ఘనంగా జరిగింది. సింగరేణి పరిసర ప్రాంతమైన గోలేటిలో గణనాథుల శోభయాత్రలో ప్రముఖులు, మహిళలు, యువత, చిన్నారులు నృత్యాలు చేస్తు అలరించారు. కోదండ రామాలయంలోని కమిటీ సభ్యులు గణేష్ లడ్డూ వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

గణేష్ నిమజ్జనోత్సవానికి భారీ భద్రతా ఏర్పాట్లు

- ఎస్పీ డీవీ.శ్రీనివాస్‌రావు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

జిల్లాలో గణేష్ నిమజ్జన కార్యక్రమానికి భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు తెలిపారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలోని బంధన్ ఫంక్షన్ హాలులో పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిమజ్జన కార్యక్రమానికి ఎక్కువ సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశమున్నందున వారితో మర్యాదగా ప్రవర్తిస్తూనే పోలీసులకు సహకరించాలని వారికి సూచించాలన్నారు. జిల్లావ్యాప్తంగా 950 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని నియమించామని, కాగజ్‌నగర్ పట్టణంలో 250 మందిని నియమించినట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం ముగిసేలా ప్రజలు కూడా తమకు సహకరించాలని కోరారు. పోలీసు సిబ్బందికి కేటాయించిన స్థలం నుండి ఎట్టి పరిస్థితులలో కదలొద్దని, సున్నిత ప్రదేశాలలో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించామన్నారు. సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా 1200 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే వారిని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, సీఐలు శంకరయ్య, శ్రీనివాస్, ఎస్ఐలు దీకొండ రమేష్, మహేందర్, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

వినాయకుని రూపాయల దండ దొంగతనం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి రెండు మండపాల వినాయకుడి మెడలో ఉన్న రూపాయల దండలు గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు. నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని వాసవి ఆలయంలో ప్రతిష్టించిన వినాయకుని మెడలో రూ.2100 విలువగల వివిధ నోట్లతో వేసిన దండ, సాయినివాడలోని వినాయకుని మెడలో వివిధ రకాల నోట్లతో వేసిన రూ.900 విలువైన దండ దొంగతనానికి గురైంది. పోలీసులకు సమాచారం అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇదే కాకుండా రెండు రోజుల క్రితం గుండి రోడ్డులోని హోలీ ట్రినిటీ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయకుని మెడలో రూపాయల దండ కూడా ఎవరో కొట్టేసినట్లు నిర్వాకులు తెలిపారు. నవరాత్రులు పూజలు చేసి చివరి రోజు దాతలకు అందజేస్తున్న దండ దొంగతనానికి గురి కావడంతో నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కరాటేలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అభినందన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కరాటే పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సోమవారం సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అభినందించారు. పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్‌కు చెందిన విద్యార్థులు అశ్విత, కట్టుకూరి త్రినాథ్, సాయి ప్రణయ్, అశ్విత్ యాదవ్, వినయ్, వినోద్, బిందుష, క్రిష్ కుమార్‌సింగ్‌లు ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని పథకాలు సాధించారు. వీరిని ఎమ్మెల్యే అభినందించి మరింత ఉన్నంతంగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు శివ, ఫాతిమా కాన్వెంట్ కరాటే మాస్టర్ దేవయ్య పాల్గొన్నారు.

19న ఉల్లిపిట్టలో మెడికల్ క్యాంపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తిర్యాణి మండలం ఉల్లిపిట్ట గ్రామంలో రామ్‌లీలా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు డీఎస్వీఆర్ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ దుర్గం దేవు, నీలాబాయి జ్ఞాపకార్థం శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జవహర్ నవోదయ ప్రవేశపరీక్ష గడువు పొడిగింపు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

2025-26 విద్యాసంవత్సరానికి గాను జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువు తేదీని ఈ నెల 23 వరకు పొడిగించినట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ పార్వతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాస్తవానికి దరఖాస్తు గడువు తేదీ ఈ నెల 16 వరకే ఉండగా, దీనిని 23 వరకు పొడిగించారని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వెళ్లి రావయ్య గణపయ్య

నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో సోమవారం వినాయక నిమజ్జనం భక్తజన సంద్రం మధ్యలో ఘనంగా జరిగింది. మండల కేంద్రంలోని సదాశివపేట శివాలయంలోని వినాయకుని ఆలయ పూజారి అంబేద శంకరయ్య, సంతోష్ వినాయక నిమజ్జనం భజభజంత్రీల మధ్యలో ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేసి వెళ్లి రావయ్య గణపయ్యని మొక్కులు తీర్చుకున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
మంగళవారం | సెప్టెంబర్ 17, 2024 | www.navatelangana.com

నిమజ్జనం ఏర్పాట్లు పరిశీలించిన ఎంపీడీఓ

నవతెలంగాణ-జైపూర్



భీమారం మండల కేంద్రంలో గణపతి నిమజ్జనోత్సవంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని భీమారం ఇన్‌చార్జీ ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. సోమవారం భీమారం గ్రామ పంచాయతీ కొత్తగూడెం కొత్త చెరువు వద్ద గణపతి నిమజ్జనం కోసం చేస్తున్న ఏర్పాట్లను స్థానిక పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ గద్దె రాంరెడ్డితో కలిసి పర్యవేక్షించారు. వాహణాల రాకపోలు, భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని విద్యుత్ దీపాలు, పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు.

గౌడ కులస్తుల సంబరాలు

నవతెలంగాణ-జన్నారం



టీపీసీసీ ప్రెసిడెంట్‌గా మహేశ్ కుమార్ గౌడ్ ఎన్నికై, ఆదివారం గాంధీభవన్‌లో ప్రమాణ స్వీకారం చేయడాన్ని హర్షిస్తూ గౌడ సంఘం మండల నాయకులు సోమవారం మిఠాయిలు తినిపించుకొని సంబరాలు చేసుకున్నారు. గౌడ సంఘం మండల అధ్యక్షుడు మూల భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి గీతా కార్మికునికి ఇందిరమ్మ ఇళ్లతో పాటు ద్విచక్ర వాహనాలు అందించాలని, ఆరోగ్య బీమా ఇవ్వాలని కోరారు. పేద గౌడులకు ఎలాంటి షరతులు లేకుండా రూ.పది లక్షల వరకు రుణం అందించాలని కోరారు. కార్యక్రమంలో జన్నారం మాజీ సర్పంచ్ గంగాధర్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, రాజన్న, రమేష్, ఎల్లయ్య మల్లేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-వేమనపల్లి

మండలంలోని నీల్వాయి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వేమనపల్లి మాజీ జడ్పీటీసీ ఆర్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ నియోజకవర్గంలోని వేమనపల్లి మండలాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని అన్నారు. మండలాన్ని అన్ని రంగాలలో ముందుంచేలా కృషి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వేమనపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ షాబీర్ అలీ, మాజీ సర్పంచ్ గాలి మధు, తిరుపతిరెడ్డి, పూర్ణ చంద్రారెడ్డి, ఒడిల రాజన్న, తోకల రాంచంద్రం కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాసిపేట : మండల కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు గోలేటి స్వామి, సీనియర్ నాయకులు రాజమొగిళి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. బెల్లంపల్లిలోని రామ్ జీ గోండ్ హాస్టల్‌లో అనాథ గిరిజన పిల్లలకు మాజీ సర్పంచ్ దరావత్ దేవి కొండయ్య ఆధ్వర్యంలో భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రౌత్ సత్తయ్య, మాజీ సహకార చైర్మన్ పూస్కూరి వంశీకృష్ణరావు, న్యాయవాది రాజన్న, ముత్యంపల్లి టౌన్ అధ్యక్షుడు దారవేని రాజయ్య, ఉపాధ్యక్షుడు రేషవేని బాపు, మాజీ కో ఆప్షన్ సభ్యుడు సిరాజ్ ఖాన్, గడ్డం పురుషోత్తం, ఆగ్గి వెంకటేశ్వర్లు, దుర్గం రాంచందర్, ఆక్కిపల్లి రాజేష్ పాల్గొన్నారు.

ఎస్టీపీపీలో గణపతి నిమజ్జనోత్సవ ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఆవరణలో ప్రతిష్ఠించిన గణపతికి ప్లాంట్ అధికారులతో కలిసి ఈడీ రాజశేఖర్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఈడీ రాజశేఖర్ రావు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్లాంట్ అభివృద్ధి, ప్లాంట్‌లో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికుల క్షేమాన్ని ఆకాంక్షిస్తూ పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. అదే విధంగా నిమజ్జనోత్సవం సంధర్భంగా ఎస్టీపీపీ టౌన్ షిప్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి శోభాయాత్ర ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ప్లాంట్ జీఎం(పీసీఎస్) శ్రీనివాసులు, చీఫ్ ఆఫ్ ఓఅండ్ఎం జేఎన్ సింగ్, ఏజీఎం ఈఅండ్ఎం మదన్ మోహన్, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి సత్యనారాయణ, సీఎంఓఏఐ అధ్యక్షులు సముద్రాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సామాజిక సేవలో అంజనీపుత్ర సంస్థ

● మంచిర్యాల ఎస్సై సురేష్



నవతెలంగాణ-మంచిర్యాల

సామాజిక సేవలో అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ సంస్థ మరిన్ని సామాజిక సేవలు చేయాలని మంచిర్యాల ఎస్ఐ సురేష్, హిందూ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు దీపేశ్ రేన్వ అన్నారు. సోమవారం అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ సంస్థ ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద ఏర్పాటుచేసిన వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిదులు వారికి ఘన స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం ఎస్సై సురేష్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు దీపేష్ రేన్వ అంజనీపుత్ర సంస్థ చైర్మన్ గుర్రాల శ్రీధర్ మాట్లాడుతూ అంజనీపుత్ర యువత ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాలుపంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. సంస్థ చైర్మన్ గుర్రాల శ్రీధర్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావంతో మానసిక శక్తి సిద్ధించడంతోపాటు సేవా దృక్పథం అలవడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంజనీపుత్ర సంస్థ చైర్మన్ గుర్రాల శ్రీధర్, ఎండీ పిల్లి రవి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లు ఎస్ కిషన్, సదానందం పాల్గొన్నారు.

ముత్యంపల్లిలో లడ్డూ వేలం

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ముత్యంపల్లి శ్రీ శివ సాయి గణేష్ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూ వేలంలో వేల్పుల పోశం లడ్డూను" రూ.1,15,116 లకు దక్కించుకున్నారు. దింతో పాటు కలశం శంభును పుట్ట కుమార్ శేఖర్ రూ.55016లకు దక్కించుకన్నారు.

మాకు 'మీ సేవ' కావాలి..!

నవతెలంగాణ-హాజీపూర్

మండలంలోని గుడిపేట్ మేజర్ గ్రామం పంచాయతీలో మీ సేవ కేంద్రం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో ఉన్న మీ సేవను గత పంచాయతీ పాలక వర్గం వద్దని చెప్పిందంటూ తీర్మానం ఇచ్చినట్లు జిల్లా ఈడీఎం చెబుతున్నారు. మూడేళ్లుగా ఆన్‌లైన్ సేవలు అందక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గుడిపేట్‌లో మీసేవ కేంద్రం లాభాలు రావడం లేదని నిర్వాహకుడు గత పంచాయతీ కార్యదర్శికి, మండల రెవెన్యూ అధికారులకు పెద్ద మొత్తంలో ముడుపులు ఇచ్చి పంచనామా పత్రం తీసుకొని మండల కేంద్రానికి బదిలీ చేయించుకున్నాడని ఆరోపణలు ఉన్నాయి. ఈ తతంగంలో స్వయానా ఈడీఎం కార్యాలయంలో ఒక ముఖ్య అధికారి హస్తం వున్నట్లు తెలుస్తోంది. మీ సేవ ట్రాన్స్‌ఫర్ విషయంలో గత సర్పంచ్‌ను వివరణ కోరగా మేము ఎలాంటి తీర్మానం చేయలేదని అంతా ఫోర్జరీ సంతకాలతో ఇలా అయి ఉండ వచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. 10 వేల జనాభా ఉన్న గ్రామంలో మీ సేవకు ఇబ్బందులు అవుతున్నాయని గత సర్పంచ్ పదవీ కాలానికి రెండు రోజుల ముందు కలెక్టర్‌కు మీ సేవ కావాలని దరఖాస్తు ఇవ్వడం కొసమెరుపు. ఇంత జనాభా ఉన్న గ్రామంలో సేవలకు ఇబ్బందులు ఎదురవుతున్న విషయం అధికారులకు తెలియడం లేదా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

జనాభా ఫుల్.. సేవలు నిల్..

మండలంలో హాజీపూర్, దోనబండ, ముల్కల్ల, వేంపల్లి, రాపల్లితో పాటు గతంలో గుడిపేట్‌లో మీ సేవ కేంద్రం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కానీ గుడిపేట్ మీ సేవ మాత్రం మూడేండ్లుగా గుడిపేట్‌లో కానరావడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. మండలంలో మేజర్ పంచాయతీ అయిన గుడిపేట్‌లో 13వ బెటాలియన్‌తో పాటు మెడికల్ కాలేజీ, మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులం, కేంద్రీయ విద్యాలయం, అర్బన్ రెసిడెన్షియల్‌లు ఉన్నాయి. నంనూరు, చందనాపూర్ గ్రామలతో పాటు దుబ్బపల్లి, గుడిపేట గ్రామాల్లో కలిపి సుమారు 10 వేల మంది జనాభా ఉంటారు. ప్రస్తుతం ప్రభుత్వ పథకాలతో పాటు, విద్యార్థుల చదువులకు అవసరమైన సర్టిఫికెట్‌లు, పోటీ పరీక్షల దరఖాస్తు, జిల్లా కార్యాలయాలకు వచ్చే ప్రజలకు మీ సేవ కేంద్రం అవసరం. కానీ ఇక్కడ మీ సేవ కేంద్రం లేకపోవడంతో హాజీపూర్ మండల కేంద్రంలో ఉన్న మీ సేవకు పోవాల్సి వస్తుంది. అక్కడికి జనం ఎక్కువ పోతుండడంతో రద్దీ ఎక్కువ అవుతుంది. సేవల కోసం పడిగాపులు కాయాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయమై ఈడీఎంను వివరణ కోరగా గుడిపేట్‌లో మీ సేవ ఉంది కాని అధి ట్రంజాక్షన్ లేదని నిర్వాహకుడు సంబధిత గ్రామ పంచాయతీ నుంచి పంచనామా పత్రం తీసుకు రావడంతో ఆ మీ సేవను మండల కేంద్రానికి ట్రాన్స్‌ఫర్ చేయడం జరిగిదని వివరణ ఇచ్చారు. ప్రజలకు మీ సేవ లేక ఇబ్బందులు పడుతున్నట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకొని పాత మీసేవను రద్దు చేసి కొత్తగా మీ సేవ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. ఏదేమైనా అధికారులు స్పందించి 10 వేల జనాభా వున్న గుడిపేట్‌లో మీ సేవ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



మూడేండ్లుగా ఆన్‌లైన్ సేవలు లేవు

బండారి సృజన్ కుమార్



మా గ్రామంలో గతంలో మీ సేవ ఉండేది. కానీ మూడేళ్లుగా మీ సేవ కానరావడం లేదు. ఏ దైన అవసరం పడితే దూరంలో ఉన్న మండల కేంద్రం పోవాల్సి వస్తుంది. అక్కడ రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఒక పనికి పోతే పొద్దు గడుస్తుంది. అధికారులు స్పందించి మా గ్రామంలో మీ సేవ ఏర్పాటు చేయాలి.

జీతాలు రికవరీ చేయడం సరికాదు



నవతెలంగాణ-జైపూర్

సింగరేణి గని కార్మికుల అంగీకారం లేకుండా జీతాలు రికవరీ చేసి వరద బాధితులకు సాయం చేస్తామనడం సరికాదని హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య ఘాటుగా స్పందించారు. సోమవారం కార్మికులతో కలిసి ఇందారం-1ఏ గనితో పాటు ఇందారం ఓపన్ కాస్ట్ గని మేనేజర్ నాగన్నకు వినతి పత్రం అందజేశారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ వరద బాధితుల సహయార్థం సింగరేణి గని కార్మికులకు ఒక రోజు వేతనం రికవరీ చేయాలని నిర్ణయానికి వచ్చిన యాజమాన్యం గుర్తింపు సంఘంతో పాటు మరో కార్మిక సంఘం అభిప్రాయం కోరినట్లు గుర్తు చేశారు. వర్షాలు, వరదలతో నష్టపోయిన వారిని ఆదుకోవడం కోసం సింగరేణికి సంబంధించిన సీఎస్ఆర్ (కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధుల నుండి సహాయం చేయాలని అన్నారు. అంతే కాని కార్మికుల అంగీకారంతో పని లేకుండా కార్మిక సంఘాల అభిప్రాయాలతో కార్మికుల జీతాల నుంచి రికవరీ చేయాలన్న అభిప్రాయాన్ని హెచ్ఎంఎస్ ఖండిస్తోందని తెలిపారు. కార్మికుల సాయం కోరాలనుకున్నప్పుడు గనుల వద్ద విరాళాల బాక్సులు ఏర్పాటు చేసి కార్మికుల నుంచి స్వచ్ఛందంగా విరాళాలు సేకరించాలని తెలిపారు. ఈ విషయంలో సింగరేణి గుర్తింపు సంఘం స్పందించాల్సిన అవసరముందని, యాజమాన్యం అభిప్రాయం తెలుపకుండా మౌనంగా ఉండటం సరికాదన్నారు. గుర్తింపు ప్రాతినిధ్య సంఘంగా కార్మికుల మనోభావాలకు అనుగుణగా నడుచుకోవాలని ఈ సంధర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా హెచ్ఎంఎస్ కార్యదర్శి అనిల్‌రెడ్డి, కేంద్ర కార్యదర్శి కంబాల నర్సయ్య, పిట్ కార్యదర్శి మేడ పెద్దన్న, కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దుర్గం లక్ష్మన్, నాయకులు ఖండే సమ్మన్న, కొట్టె సురేష్, కొల్లూరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు మరువలేనివి

● ఎస్టీపీపీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజశేఖర్‌రావు



నవతెలంగాణ-జైపూర్

మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశానికి అందించిన సేవలు మరువలేనివని జైపూర్ ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావు అన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని సోమవారం ప్లాంట్ అదికారులతో కలిసి ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య భారత దేశానికి సంబంధించిన మొట్టమొదటి ఇంజనీర్ అని నీటి ప్రవాహానికి అనుగుణంగా ఆనకట్టకట్టి ఎటువంటి ప్రమాదం లేకుండా నీటిని నిల్వ చేస్తూ ఆటోమెటిక్‌గా గేట్ల వ్యవస్థను ఆయన రూపొందించారని పేర్కొనారు. మైసూర్ వద్ద గల కృష్ణరాజ సాగర్ ఆనకట్టలలో దీనిని బాగా వాడుకున్నారని, హైదరాబాద్ నగరాన్ని మూసీ నది వదరల నుంచి రక్షించడానికి ఒక వ్యవస్థను రూపొందించారని గుర్తు చేశారు. అదేవిధంగా విశాఖపట్నం రేవును సుముద్రపు కోత నుండి రక్షించే వ్యవస్థను రూపోందించడంలో ఆయన కీలక ప్రాత్ర పోషించారని తెలిపారు. సాంకేతికంగా భారతదేశం అభివృద్ధి చెందడంలో ఆయన ఎంతగానో కృషి చేశారని అన్నారు. అటువంటి మన మొదటి ఇంజనీర్ భారతరత్న మోక్షగుండం శిశ్వేశ్వరయ్య స్ఫూర్తిగా మనమంతా దేశాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. అదేవిదంగా మన దేశ అభివృద్ధిలో ఇంజనీర్ల ప్రాత ఎంతో ఉందని, అంతరిక్ష పరిశోధనలో చంద్రయాన్, మంగళ్‌యాన్, అటల్ టన్నెల్, చినాబ్ రైల్వే బ్రిడ్జి ప్రపంచంలో అత్యంత ఎతైన పొడవైన బ్రిడ్జిని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక అభివృద్ధిలో 5వ స్థానంలో ఉన్న మనం 2047 నాటికి ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలువాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ జీఎం శ్రీనివాస్, చీఫ్ ఆఫ్ ఓఅండ్ఎం జేఎన్ సింగ్, ఏజీఎం సివిల్ ప్రసాద్, ఈఅండ్ఎం మదన్ మోహన్, సముద్రాల శ్రీనివాస్, ఎస్వోటూ ఈడీ ప్రభాకర్ రావు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఠాకూర్ మోహన్ సింగ్ పాల్గొన్నారు.

సింగరేణిలో త్వరలోనే ఈ-ఆఫీస్

నవతెలంగాణ-జైపూర్

పేపర్ రహిత కార్యకలాపాలకు వీలుగా రెండు నెలల్లో ఈ ఆఫీసును సింగరేణి అందుబాటులోకి తీసుకురాబోతుంది. సింగరేణి వ్యాప్తంగా ఉన్నటువంటి 39 గనుల పరిధి కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు వీలుగా డిజిటలీకరణ చేయాలని సంస్థ భావిస్తోంది. ఈ విషయంలో సింగరేణి సీఎండీ ఇప్పటికే సింగరేణి వ్యాప్తంగా అధికారులతో సమీక్షించారు. సింగరేణి ఉద్యోగులకు సంబంధించిన బదిలీల విషయంలో ఇప్పటికే ఒక ప్రత్యేక పాలసీ కొనసాగుతోంది. సుమారు 40 వేల మంది కార్మికులున్న సింగరేణి సంస్థలో ఇప్పటి వరకు బదిలీల విధానం లేదు. దీనిపై దృష్టి సారించిన సింగరేణి కార్మికుల బదిలీ విధానాన్ని రూపొందించాలని సీఎండీ సంబంధిత అధికారులను ఆదేశించారు. అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా బదిలీ విధానాన్ని రూపొందించాలని సూచించారు. ఏడాదిలో నిర్ణీత నెలల్లోనే బదిలీల ప్రక్రియ పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, ఫలితంగా ఉత్పత్తిపై ప్రభావం ఉండదని యాజమాన్యం భావిస్తోంది. ఎస్‌డబ్ల్యూఏ ఉద్యోగుల కోసం ట్రాన్స్‌ఫర్ పాలసీ ఆన్‌లైన్‌లో ఉద్యోగుల బదిలీలు, విజ్ఞప్తులు స్వీకరణకు యాప్ రూపొందించనుంది. అన్ని గనుల డిజిటలీకరణ, సీసీ కెమెరాల ద్వార పర్యవేక్షణ, ఉత్పాదకత పెంపుపై నూతన ఉద్యోగులకు అవగాహణ కల్పించాలని పర్సనల్ విభాగం అధికారులతో సీఎండీ సమీక్షించారు. సంస్థలో మరింత పారదర్శకత పెంచడానికి వీలుగా ఆన్‌లైన్ ద్వార బదిలీల విజ్ఞప్తులు, ఇతర వినతుల స్వీకరణకు ప్రత్యేక అప్లికేషన్ రూపొందించాలని ఐటీ విభాగాన్ని యాజమాన్యం ఆదేశించింది. ఫలితంగా ఉద్యోగులకు అత్యంత సౌలభ్యంగా ఉంటుందని సుదూర ప్రాంతాల నుంచి విజ్ఞప్తి పత్రాలతో ఉద్యోగులు కార్పోరేట్ కార్యాలయాల వరకు రావడం తగ్గడంతో పాటు పారదర్శకత మరింత పెరుగుతుందని భావిస్తోంది. కాగా కొత్తగా ఉద్యోగాల్లో చేరిన బదిలీ వర్కర్లు డ్యూటీలకు గైర్హాజరు ఎక్కువ అవుతున్న నేపథ్యంలో దీనిపై దృష్టి సారించాలని, వారికి సరైన అవగాహణ కల్పించడం ద్వార ఉత్పాదకత పెంపుకు సహకరిస్తుందని యాజమాన్యం భావిస్తోంది. మహిళా ఉద్యోగుల సేవలను గనుల్లో సద్వినియోగం చేసుకోవడానికి వీలుగా రక్షణ విధానాలను(ఎస్వోపీ) సంస్థ రూపొందిచనున్నట్లు తెలుస్తోంది.

ప్రశాంతంగా నిమజ్జనోత్సవం నిర్వహించాలి

● రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లాలో నిర్వహించే గణేష్ నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సహకరించాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ సూచించారు. సోమవారం పట్టణంలో ఆయన పర్యటించారు. నిమజ్జనం చేసే గోదావరి ప్రాంతాన్ని, విగ్రహాలను తరలించే రహదారి మార్గాన్ని పరిశీలించారు. ట్రాఫిక్ సమస్యలు రాకుండా ఉండేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. పోలీసులకు తగిన సూచనలు అందించారు. సీపీతో మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్, ఏసీపీ ఆర్ ప్రకాష్, సీఐ బన్సిలాల్ ఉన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంతో సహా పలు గ్రామాల్లో తొమ్మిది రోజులుగా నిర్విఘ్నంగా పూజలు అందుకున్న వినాయకుడిని, ఆయా గ్రామాల్లో మండప నిర్వాహకులు సోమవారం వినాయక నిమజ్జనం చేశారు. ముందుగా మండలంలోని చింతాగూడ గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్ ఆధ్వర్యంలో గోదావరిలో నిమజ్జనం చేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆర్యవైశ్య సంఘ నాయకులు ఏర్పాటు చేసిన మహాగణపతికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, వినాయక నగర్‌లో ఏర్పాటు చేసిన గణపతి వద్ద మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదనరావు, మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీ ఖాన్, రాష్ట్ర నాయకులు తాళ్లపల్లి రాజేశ్వర్, ఖదార్ల నరసయ్య ప్రత్యేక పూజలు చేశారు. కిష్టాపూర్ గ్రామంలో హనుమాన్ వినాయకుని మండపం వద్ద వాసాల నరేష్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పొనకల్ మేజర్ గ్రామపంచాయతీ పక్కనే ఏర్పాటుచేసిన, వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే తిమ్మాపూర్ గ్రామంలో ఆరు చోట్ల ఏర్పాటుచేసిన వినాయక మండపాల వద్ద నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రాజ వర్ధన్ ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ప్రతి గ్రామంలో పోలీస్ నిఘా ఏర్పాటు చేసి ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనం నిర్వహించారు.

సింగరేణి సేవా సమితిని సద్వినియోగం చేసుకోవాలి

● ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్ రావు



నవతెలంగాణ-జైపూర్

మహిళా సాధికారత కోసం సింగరేణి సేవా సమితి ద్వార అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని జైపూర్ ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్ రావు సూచించారు. సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో 25 మంది మహిళలకు కుట్టు శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి ప్రభావిత గ్రామాలకు చెందిన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభావిత గ్రామాల మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు వివిధ రకాలైన స్వయం ఉపాది శిక్షణ కార్యక్రమాలు సింగరేణి సేవా సమితి ద్వార అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి సేవా సమితి కోఆర్డినేటర్ అరుణ, టైలరింగ్ శిక్షకురాలు రఫియా, సేవా సమితి ఇన్‌చార్జి ఆఫీసర్ ఠాకూర్ మోహన్‌సింగ్ పాల్గొన్నారు.

కబడ్డీ విజేతలకు బహుమతుల ప్రదానం



వేమనపల్లి : మండల కేంద్రంలో వేమన యూత్ గణేష్ మండలి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కబడ్డీ పోటీలను టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోళి వేణుమాధవ్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో జిల్లా వ్యాప్తంగా 27 జట్లు తలపడగా మొదటి బహుమతిగా బూరుగుపల్లి జట్టు రూ.20,000, రెండవ బహుమతి వేమనపల్లి జట్టుకు రూ.10,000 ప్రైజ్ మని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుబిడే మధుకర్, సహకార సంఘం చైర్మన్ కుబిడే వెంకటేశం, నాయకులు ఉప్పులపు సాయి, పురాణం లక్ష్మీ కాంత్, కొండగొర్ల బాపు, మోర్ల మొండి పాల్గొన్నారు.

తాండూర్ జమా మసీదులో అన్నదానం

నవతెలంగాణ-తాండూర్



మిలాద్ ఉన్ నబి సందర్భంగా సమీఖాద్రిఖాన్ ఖయే సుఫియా వెల్ఫేర్ సొసైటి ఆధ్వర్యంలో తాండూర్ ఐబీలో జామ మసీదులో యువకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండలం మొహమ్మద్ ప్రవక్త జన్మదినం పురస్కరించుకొని వేడుకల్లో భాగంగా ఖవ్వాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు మాట్లాడుతూ గత 14 సంవత్సరాల నుంచి కులమతాలకు అతీతంగా కార్యక్రమన్ని చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ సల్వాజి మహేందర్ రావు, మాజీ జడ్పీటీసీ సభ్యులు బాణయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సిరంగిశంకర్, మాజీ కోఆప్షన్ సభ్యుడు రహమత్‌ఖాన్, ఖాన్ ఖయే సుఫియా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

రిమ్స్ డైరెక్టర్ ప్రసాదం అందజేత

నవతెలంగాణ-ఆదిలాబాద్



పట్టణంలోని రామ్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన శ్రీ చంద్ర గణేష్ మండల్ ప్రసాదాన్ని రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జయ్‌సింగ్ రాథోడ్‌కు శ్రీ చంద్ర గణేష్ మండల్ సభ్యులు సామనపల్లి రామన్న, గూడెం నరేష్ అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ జయ్‌సింగ్ రాథోడ్ మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించిన గణేష్ ప్రసాదం తనకు ఎంతో ప్రాధాన్యతగా ఉందని తెలిపారు. రాంనగర్ కాలనీకి చెందిన శ్రీ చంద్ర గణేష్ మండల్ నిర్వహకులు తనకు ప్రత్యేకంగా ప్రసాదం అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ పీఏ అశ్విన్ కుమార్ ఉన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

- శోభాయాత్రలో ఆకట్టుకున్న నృత్యాలు
- ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు



జైపూర్ : గోదావరి వద్ద నిమజ్జనాన్ని పరిశీలిస్తున్న సీపీ



దండేపల్లి : రాయపట్నం గోదావరిలో నిమజ్జనం

నవతెలంగాణ-లక్షెట్టిపేట

లక్షెటిపేట మున్సిపాలిటీ పరిధిలోని వినాయకుడి నిమజ్జన కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని, పట్టణంలోని ప్రత్యేక మండపాల్లో గణనాధులకు నవరాత్రులు భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహాలను ప్రత్యేక వాహనాలలో ఏర్పాటు చేసి శోభాయాత్ర నిర్వహించారు. ఊరేగింపులో భక్తుల నృత్యాలు, కోలాటాలు, భజనలు ఆకట్టుకున్నాయి. వివిధ ప్రాంతాల వద్ద నిమజ్జనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా లక్షెటిపేట సీఐ అల్లం నరేందర్, ఎస్ఐ పి సతీష్, ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

తాండూర్ : మండలంలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర సోమవారం సాంప్రదాయ నృత్యాలతో డప్పు వాయిద్యాలతో ఘనంగా సాగింది. మండల కేంద్రమైన తాండూర్ ఐబీలో బోయపల్లి ద్వారకాపూర్ రేచిని మాదారం గ్రామాలలో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తాండూరు పోలీసు శాఖ బంధోవస్తు నిర్వహించారు. తాండూర్ సిఐ కుమారస్వామి శోభాయాత్ర సందర్భంగా పెట్రోలింగ్ నిర్వహించారు. తాండూర్ ఐబి కేంద్రంలోని ఆర్యవైశ్య, శ్రీగణేష్ మండలి సభ్యులు కోలాటాలతో సాంప్రదాయ నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు

జైపూర్ : వినాయక చవితిని పురస్కరించుకుని గ్రామాల వారిగా కొలువుదీరిన గణపతి నవరాత్రి ఉత్సవాల సందడి సోమవారంతో ముగిసింది. తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణపతి విగ్రహాలను అత్యంత భక్తి శ్రద్ధల మధ్య నిమజ్జనం చేశారు. గోదావరి తీర ప్రాంత గ్రామాల వారు గణపతి విగ్రహాలను స్థానిక గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. మండలంలోని పలు గ్రామాలతో పాటు శ్రీరాంపూర్ సింగరేణి ఏరియాకు సంబంధించిన విగ్రహాలు ఇందారం సమీప గోదావరి వంతెన వద్ద గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. పోలీస్ పహారా భారీ బందోబస్తు మధ్య గణపతి విగ్రహాల శోభాయాత్ర కొనసాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులతో కలిసి పోలీస్ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. అదేవిధంగా సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వార నిమజ్జన ప్రక్రియను పర్యవేక్షించారు. ఇందారం గోదావరి వంతెన వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జనానికి సంబంధించి వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక ఎస్సై శ్రీధర్ పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు..

భీమారంలో..

భీమారం మండల కేంద్రంలో స్థానిక కొత్త చెరువులో సోమవారం గణపతి విగ్రహాల నిమజ్జనం పూర్తి చేశారు. వాహనాల రాకపోకలు, భక్తుల రద్దీకి అనుగుణంగా కొత్త చెరువు వద్ద అవసరమైన మేరకు ఎల్ఈడీ విద్యుత్ దీపాలు అమర్చడంతో పాటు ప్రమాదాలకు తావివ్వకుండా విగ్రహాల నిమజ్జనం కోసం క్రేన్ ఏర్పాటు చేసినట్లు స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి క్రిష్ణమూర్తి తెలిపారు. గ్రామ పంచాయతీ కార్మికులతో పారిశుధ్య పనులు పర్యవేక్షించినట్లు తెలిపారు. గ్రామాల వారిగా గణపతి నవరాత్రోత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. గణపతి నిమజ్జనోత్సవ శోభాయాత్రలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక ఎస్ఐ రాములు బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కాసిపేట : మండలంలో సోమవారం ఘననాధుడికి ఘనంగా వీడ్కోలు పలికి నిమర్జనం చేశారు. గ్రామాల్లో గణేషుని శోభయాత్ర నిర్వహించి చిన్నా, పెద్దా తేడా లేకుండా ఉత్సాహంగా డప్పు చప్పుల్ల మధ్య నృత్యాలు చేస్తూ గణేషుడికి వీడ్కోలు పలికారు. ముందుగా వినాయకుడి ప్రత్యేక పూజలు నిర్వహించి లడ్డూ, కలుషం, వస్త్రాలను వేలం పాట వేయగా అధిక వేలం పాడి పలువురు భక్తులు దక్కించుకున్నారు. కొన్ని చోట్ల లక్కీ డ్రా ఏర్పాటు చేశారు. కాసిపేట మండలంలోని భక్తులు మంచిర్యాల గోదావరి తీరానికి తరలి వెళ్లి ఘననాధుడిని నిమర్జనం చేశారు.

ఉట్నూర్ : హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సోమవారం గణేష్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, జెడ్పీ మాజీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. వినాయకుని శోభాయాత్రను డప్పు చప్పుల మధ్య యువత ఉత్సాహంగా నృత్యాలు చేశారు. శోభాయాత్ర అర్ధరాత్రి వరకు కొనసాగుతున్న సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో దర్శించుకొని శాంతియుత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ యువరాజ్, తహసీల్దార్ ప్రవీణ్, బీజేపీ నాయకుడు రితేష్ రాథోడ్, కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ, డీఎస్పీ నాగేందర్, సీఐ మొగిలి, ఎస్సై మనోహర్, హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొండేరి రమేష్, ప్రధాన కార్యదర్శి సంజీవ్ రెడ్డి, ప్రచార కార్యదర్శి న్యానేశ్వర్, సంతోష్, గోపాల్ సింగ్, ఆత్రం తిరుపతి, లింగా గౌడ్, ప్రకాష్, దేవిదాస్, గ్రామపంచాయతీ ఈఓ శంకర్, భక్తులు పాల్గొన్నారు.



జైపూర్ కంట్రోల్ రూమ్‌లో..



లక్షెట్టిపేటలో ..



జైపూర్‌లో..



రెబ్బెనలో..



తాండూర్‌లో..



లక్షెట్టిపేటలో ..



దండేపల్లిలో ..

నకాషీ గణేష్ మండల సభ్యులకు సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వినాయక చవితి పండగ ప్రాశస్త్యాన్ని కాపాడుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న నకాషీ గణేష్ మండల్ సభ్యులను జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ తరపున సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక పర్యావరణ కమిటీ కన్వీనర్ రామగిరి శివకుమార్ మాట్లాడుతూ పండుగలలో అనాదిగా ప్రకృతిని ఆరాధిస్తూ ఆ ప్రకృతిని కాపాడే విధంగా పండుగలు జరుపుకునే క్రమంలో నేడు వింత పోకడలతో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన నిలువెత్తు విగ్రహాలని ప్రదర్శిస్తూన్న క్రమంలో నకాషీ గణేష్ మండల్ పూర్తిగా మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించి జిల్లాకు ఆదర్శంగా నిలిచారన్నారు. పట్టణంలోని గణేష్ మండపాలు నిర్వహించేవారు ప్రతి ఒక్కరు వీరిని ఆదర్శంగా తీసుకుంటే ఈ నకాషీ వృత్తి వాళ్లకి ఒక రకమైన ఉపాధి కల్పిస్తూ పర్యావరణం కూడా నష్టపోకుండా మన అసలైన పండగ విశేషాలు భావి తరాలకు అందించిన వారవుతారని తెలిపారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి పెంటపర్తి ఊశన్న, పర్యావరణ కమిటీ కార్యదర్శి శివకుమార్, సురేష్, నాగరాజు, నాగోరావ్ పాటిల్, వినోద్, రాకేష్ ఉన్నారు.

గణేష్ లడ్డూ వేలం

నవతెలంగాణ-రెబ్బెన

మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలో గల శ్రీ సిద్ధివినాయక గణేష్ మండలి ఆధ్వర్యంలో లడ్డు వేలం పాట నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో వేలం పాటలో పాల్గొన్నారు. మండల కేంద్రానికి చెందిన దుర్గం రాజేష్ వినిషా దంపతులు రూ.26001లకు స్వామి లడ్డు ప్రసాదాన్ని గెలుచుకున్నారు. నిర్వాహకులు వారి కుటుంబ సభ్యులకు అందించారు.

నేడు మద్యం దుకాణాలు మూసివేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలో ఈనెల 17న మద్యం దుకాణాలను మూసి వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ విజేందర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలో మంగళవారం వినాయక నిమజ్జనం శోభాయాత్రను పురస్కరించుకొని కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మద్యం వ్యాపారులు ఎవరైనా ఈ సమయాల్లో విక్రయాలు జరిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. తిరిగి బుధవారం యధావిధిగా దుకాణాలు తెరుస్తారని పేర్కొన్నారు.

మాల సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడిగా నక్క మహేందర్



నవతెలంగాణ-నేరడిగొండ

మాల సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడిగా నక్క మహేందర్‌ను ఎన్నుకున్నట్టు సంఘం సభ్యులు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో మాల కులస్తులందరూ కలిసి అధ్యక్షుడిగా నక్క మహేందర్, మండల ఉపాధ్యక్షులుగా మద్దెల నారాయణ స్వామి, ఎన్నుకోగా, నేరడిగొండ గ్రామాధ్యక్షుడిగా చిప్పరి రాజేశ్వరిని ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షుడి యాట అనిల్, ప్రధాన కార్యదర్శిగా బత్తుల మోహన్, కోశాధికారిగా పట్టేపు మహేందర్‌ని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నుకోబడిన కమిటీకి సంఘ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, నారాయణస్వామి, అనుపట్ల సంజీవ్, ధావుల ప్రశాంత్ పాల్గొన్నారు.

పాలాజ్ కర్ర వినాయకుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నేరడిగొండ

నిర్మల్ జిల్లా భైంసా పట్టణ సమీపంలోని ఉన్న పాలాజ్ కర్ర వినాయకుడిని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దంపతులు దర్శించుకుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గత 75 సంవత్సరాలుగా ప్రత్యేకపూజలు అందుకుంటున్న గణనాథుడిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. అదేవిధంగా ఆ విఘ్నేశ్వరుని ఆశీర్వాదాలు బోథ్ నియోజకవర్గ ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, ధనరాజ్ జాదవ్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

నవతెలంగాణ-బోథ్

మండలంలోని మర్లపెల్లి గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు గ్రామ సమీపంలోని పేకాట ఆడుతుండగా పోలీసులకు అందిన సమాచారం మేరకు ఆదివారం వారిని పట్టుకున్నట్టు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.15,950 పట్టుకొని స్వాధీనం పర్చుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

వెనుకబడిన కులాలకు చేయూతనందిస్తా

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

వెనుకబడిన కులాలకు చేయూతనందిస్తానని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. సోమవారం మండలంలోని యాపల్‌గూడలో రూ.20లక్షలతో చేపట్టనున్న మున్నూరుకాపు సంఘ భవనానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని రంగాల్లో వెనుకబడ్డ బీసీ వర్గాల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని, ప్రతి కులానికి కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. బీసీల్లో సంఘ భవనాలు, స్థలాలు లేక ఉన్న కులాలను గుర్తించడం జరిగిందన్నారు. ఈ సమస్యపై రాష్ట్రస్థాయిలో పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. యాపల్‌గూడ గ్రామంతో తనకు ఎంతో అనుబంధం ఉందన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కాళ్ల విఠల్, కిష్టయ్య, శ్రీనివాస్, సంతోష్, గంగారెడ్డి, జయరాం, దయాకర్, బోయర్ విజయ్ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- నల్ల బ్యాడ్జీలు ధరించి జూడాల నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఇటీవల కోల్‌కత్తాలో వైద్యురాలిపై జరిగిన లైంగికదాడి, హత్య ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని ఆదిలాబాద్ రిమ్స్ జూనియర్ డాక్టర్లు డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి రిమ్స్ జూనియర్ డాక్టర్స్ క్యాంపస్ ఆవరణలో డాక్టర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం జరగాలని కోరుతూ గణేష్ మండపం వద్ద వైద్యులు పూజలు నిర్వహించారు. సుప్రీం కోర్టు తీర్పు తమ వైద్య ఆరోగ్య సమాజంలో తీవ్ర నిరాశను కలుగజేసిందన్నారు. వెస్ట్ బెంగాల్ ప్రభుత్వ వైఖరిని తాము కండిస్తున్నట్లు పేర్కొన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ఈనెల 17న ఉందని దేశ వ్యాప్తంగా రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ బాధితురాలికి న్యాయం జరిగేందుకు నిరసనకు దిగాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామన్నారు. నిందితులను శిక్షించే వరకు నిరసనలు తెలుపుతాని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డా.అన్వేష్, డా. అభినయ్, ప్రత్యుష, ప్రసన్న, శ్యామ్ ఉన్నారు.

గణేష్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండల కేంద్రంలోని ప్రధాన్‌గూడ, గోండుగూడ, సార్వజనీక్, భీంనగర్, సోనార్ గల్లీ, హనుమాన్ నగర్ తదితర కాలనీల్లో గణేష్ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథులను సోమవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు బాగా ఉండాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గణేష్ మండపాలకు ఉచిత కరెంటును అందిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు కాలనీల్లో గణేష్ మండలి సభ్యులు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే స్థానికులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కేశవ్ ముస్లె, టెహరే, గణేష్, యూత్ సభ్యులు ఉన్నారు.

రిమ్స్ డైరెక్టర్‌కు, డాక్టర్‌కు సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల రిమ్స్ సూపర్ స్పెషాలిటీలో అరుదైన శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. సోమవారం ఆస్పత్రిలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డాక్టర్ జక్కుల శ్రీకాంత్‌ను శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. రిమ్స్ అనుబంధ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అంకాలజీ వైద్యనిపుణులు జక్కుల శ్రీకాంత్ సమస్యాత్మక క్యాన్సర్ శస్త్ర చికిత్సలు చేసినందుకు వారిని సత్కరించినట్టు తెలిపారు. ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, బాధితులు సద్వినియోగం చేసుకోవాలని డైరెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బావునే నగేష్, కార్యదర్శి ఉగ్గే నానయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రాథోడ్ ప్రహ్లద్, ఉపాధ్యక్షుడు నిరటి మోహన్, గౌరవాధ్యక్షులు సయ్యద్ హేంజ, పట్టణ అధ్యక్షులు ధుపె శంకర్, కార్యదర్శి సంతోష్, మహేందర్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

మూడు నెలల ముందు గంగిరెద్దులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్



మీ ఇంటి మేలు జరుగుతాదని చెప్పు, మంచి జరుగుతాదని చెప్పు అంటూ గంగిరెద్దుల తలను ఊపిస్తూ ప్రజలను ఆనందింపజేస్తారు గంగిరెద్దుల వారు. దేశంలో ఆ మూల నుంచి ఈ మూల వరకు మకాం వేస్తూ, యాచిస్తూ సంచార జీవులుగా బతుకుతుంటారు. ప్రతి సంవత్సరం వీరు సంక్రాంతి ముందు వచ్చి యాచిస్తారు. కాని ఈ సంవత్సరం మాత్రం మూడు నెలల ముందుగానే వచ్చి యాచిస్తున్న చిత్రం సోమవారం మావల మండలంలోని దుబ్బాగూడ ఇంటింటికి తిరుగుతూ గంగిరెద్దుల తలను ఆడిస్తూ, తమ యాచక వృత్తిని కొనసాగిస్తున్నారు.

మలేరియా పరీక్షలపై జాగ్రత్తలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మలేరియా నిర్ధారణ పరీక్షలపై పూర్తిస్థాయి జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ అన్నారు. సోమవారం రిమ్స్‌లోని మలేరియా ల్యాబ్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన టెస్టుల గురించి ల్యాబ్ టెక్నీషియన్ రమణచారిని అడిగి తెలుసుకున్నారు. మలేరియా పరీక్షలు పూర్తిస్థాయిలో జాగ్రత్తగా చేయాలని సూచించారు. జిల్లాలో మలేరియా కేసులు చాలా తక్కువగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ శ్రీధర్, ల్యాబ్ టెక్నీషియన్ బండారి కృష్ణ ఉన్నారు.